

డీసీపీ-1 అజితా వేజెండ్ల బదిలీ

- నెల్లూరు జిల్లా ఎస్పీగా నియామకం



విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో డీసీపీ-1గా పనిచేస్తున్న అజితా వేజెండ్లకు శనివారం బదిలీ అయింది. ఆమెను నెల్లూరు జిల్లా ఎస్పీగా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 14 మంది ఎస్పీ స్థాయి అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. అందులో భాగంగా ఆమెను నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించలేదు.

నేడు బీజేపీ సభ

- ముఖ్య అతిథిగా పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా హాజరు

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆదివారం నగరంలోని రైల్వే మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ 'సారథ్యం' పేరుతో చేపట్టిన యాత్రకు ఇది ముగింపు సభ. దీనికి పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా హాజరవుతున్నారు. శనివారం రాత్రి ఆయన నగరానికి చేరుకున్నారు. మొత్తం రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సభకు తరలివస్తున్నారు. కార్యకర్తలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు ఈ వేదిక పైనుంచి పిలుపు ఇవ్వనున్నారు. రైల్వే మైదానంలో బహిరంగ సభ ఏర్పాట్లను శుక్రవారం పీవీఎన్ మాధవ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, జిల్లా అధ్యక్షులు పరశురామ్ తదితరులు పరిశీలించారు. ఈ సభలో కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ పాల్గొననున్నారు.



విమానాశ్రయంలో బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాకు స్వాగతం పలుకుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, తదితరులు

19న డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్‌ల చేతుల మీదుగా అందజేత
- వెలగపూడిలో సచివాలయం సమీపాన అభినందన సభ
- ఉత్తరాంధ్రలో గల 2,660 అభ్యర్థుల కోసం 118 బస్సులు ఏర్పాటు
- ఆ కార్యక్రమం ముగిసిన అనంతరం అభ్యర్థులకు పది రోజులపాటు శిక్షణ



అభ్యర్థుల పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19వ తేదీన అమరావతిలో నియామక పత్రాలు అందజేస్తారు. ఇందుకోసం వెలగపూడిలో సచివాలయం వెనుక అభినందన సభ ... మిగతా 6వ పేజీలో

పార్కుకు ఎసరు!

పెదరుషికొండ కృష్ణా కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో 2,400 గజాలు ఓపెన్‌స్పేస్

- విలువ రూ.20 కోట్లు
- నకిలీ పత్రాలతో కొట్టేసేందుకు కొందరి యత్నం
- ఐదేళ్ల కిందట పార్కులో షెడ్ నిర్మించడంతో కేసు నమోదు
- అయినా పట్టువదలని కబ్జాదారులు
- వెనకుండి నడిపిస్తున్న వైసీపీ చోటా నేత
- విక్రయించేందుకు రూ.కోటి అడ్వాన్సు తీసుకున్నట్టు ప్రచారం
- పట్టించుకోని జీవీఎంసీ



లేఅవుట్‌లోని పార్కు స్థలం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో పార్కులు, ఓపెన్ స్పేస్‌ల కబ్జా పర్వం కొనసాగుతోంది. వీటి పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని జీవీఎంసీ అధికారులు చెబుతున్నా... ఆచరణలో కనిపించడం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. తాజాగా పెదరుషికొండలోని కృష్ణా కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లోని పార్కు స్థలానికి నకిలీపత్రాలు సృష్టించిన కొందరు వేరొకరికి విక్రయించేందుకు రంగం సిద్ధం చేశారు. అయినా జీవీఎంసీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

పెదరుషికొండ పంచాయతీగా ఉన్న సమయంలో కొంతమంది రైతుల నుంచి కొనుగోలు చేసి కృష్ణా కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ (సత్యసాయి నగర్) పేరుతో (ఎల్‌పీ నంబరు 22/84) లేఅవుట్ వేశారు. అందులో 50 సెంట్లు (2,400 గజాలు) పార్కుకు కేటాయించారు. అందులో భవిష్యత్తు అవసరాల కోసమంటూ ఒక వాటర్ ట్యాంకును నిర్మించారు. తర్వాత కాలంలో పెదరుషికొండ నగర పాలక సంస్థలో విలీనం కావడంతో లేఅవుట్‌లోని పార్కు స్థలం జీవీఎంసీకి దఖలుపడింది. దీంతో పార్కులో నిర్మించిన వాటర్ ట్యాంకుపై సొసైటీ పేరుతోపాటు పార్కుస్థలం జీవీఎంసీకి చెందినట్టు పెయింట్‌తో రాయించారు. ఇదిలావుండగా ఐదేళ్ల కిందట వైసీపీ హయాంలో ఆ పార్కు స్థలంపై కొందరు కన్నేశారు. స్థానికంగా ఉండే వైసీపీ చోటా నేత ఆధ్వర్యంలో లేఅవుట్‌కు భూములు విక్రయించిన వ్యక్తుల వారసుల పేరుతో కొందరిని తెరపైకి తెచ్చారు. పార్కుకు ... మిగతా 6వ పేజీలో

స్థానికులకు ఉక్కు మొండిచెయ్యి

- నాలుగు నెలల క్రితం 4,500 మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపు
- వారి స్థానంలో ఇతర రాష్ట్రాల వారికి అవకాశం
- నాలుగు రోజులుగా శిక్షణ
- వ్యతిరేకిస్తున్న నిర్వాసితులు
- ఆందోళనలు ప్రారంభం



ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు వర్కర్ల సంఘం సభ్యులు

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం కాంట్రాక్టు వర్కర్ల విషయంలో మొండిగా వ్యవహరిస్తోంది. అవసరానికి మించి ఉన్నారంటూ మే నెలలో 4,500 మందిని తొలగించింది. ఇప్పుడు వివిధ పనులకు కాంట్రాక్టు వర్కర్లు అవసరం కావడంతో స్థానికులకు అవకాశం కల్పించకుండా బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి కూలీలను దిగుమతి చేసుకుంటోంది. ఈ విధంగా గత నాలుగు రోజులుగా రోజుకు 100 నుంచి 150 మందికి భద్రతా విభాగంలో శిక్షణ ఇస్తోంది. ప్లాంటుకు కొత్తగా ఎవరైనా పని చేయడానికి వస్తే వారికి పని ప్రాంతంలో ఎలా ఉండాలి?, ఎలాంటి భద్రత పరికరాలు ధరించాలి?...అనే అంశాలపై వారం రోజులు శిక్షణ ఇస్తారు. అది పూర్తయిన వెంటనే 'సేఫ్టీ పాస్' అని ఒక సర్టిఫికెట్ ఇస్తారు. దాంతో వారు కాంట్రాక్టు వర్కర్లుగా ఏ ... మిగతా 6వ పేజీలో

డెక్‌కు భలేడు డిమాండ్

అందులో స్పేస్ కోసం పోటాపోటీ

- ఖాళీగా ఉన్న ఒక్క ఫ్లోర్‌కు రంగంలో మూడు సంస్థలు...
- అమరావతి నుంచి సిఫారసులు
- 19న వేలం నిర్వహించాలని వీఎంఆర్‌డీఏ నిర్ణయం
- ఎవరు ఎక్కువ ఇస్తే వారికే దక్కే అవకాశం



సిరిపురం జంక్షన్‌లోని మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ భవనం (ది డెక్)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగరాభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) సిరిపురం జంక్షన్‌లో నిర్మించిన మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ భవనం (ది డెక్)లో కార్యాలయం ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన స్పేస్ కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. ఆఫీస్ పెట్టుకోవడానికి అవకాశం కల్పించాలంటూ పలు పేరొందిన సంస్థలు సీఎం పేషీ నుంచి రికమెండేషన్ చేయించుకుంటున్నాయి. అయితే ఉన్నది ఒక్కటే ఫ్లోర్ కావడం, దానికి తీవ్రమైన పోటీ ఏర్పడడంతో అధికారులు చేసేదేమీ లేక బహిరంగ వేలం పెట్టాలని నిర్ణయించారు. ఈ నెల 19న వేలం నిర్వహించి ఎవరు నిబంధనలన్నీ పాటించి, ఎక్కువ మొత్తం ఇవ్వడానికి ముందుకు వస్తారో వారికే ఇవ్వాలని భావిస్తున్నారు. దీనికి 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వీఎంఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరిచామని చెబుతున్నారు.

కీలకమైనవన్నీ అక్కడే..

ది డెక్‌ను 12 అంతస్థులుగా నిర్మించారు. కింద మూడు బేస్‌మెంట్లు, గ్రౌండ్ ఫ్లోర్, ఏడు అంతస్థులు, టెర్రస్ కలిపి మొత్తం పన్నెండు ఉన్నాయి. బేస్‌మెంట్‌తో పాటు పైన రెండో అంతస్థును పార్కింగ్‌కు కేటాయించారు. వాటిలో 440 కార్లు, 250 ద్విచక్ర వాహనాలు పెట్టుకోవచ్చు. మూడో అంతస్థును జార్జియా యూనివర్సిటీ తీసుకుంది. అదే అంతస్థులో డెక్ ఉంది. దానిని కూడా యూనివర్సిటీ కోసమే తీసుకున్నారు. నాలుగో అంతస్థును బెల్ సంస్థ ఐటీ కార్యాలయం కోసం ఒప్పందం చేసుకుంది. ఐదో అంతస్థులో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేశారు. ఆరు, ఏడు అంతస్థులను దక్షిణ కోస్తా రైల్వే జోన్ జీఎం కార్యాలయం కోసం కేటాయించారు.

ఖాళీగా ఉన్నది ఒకటే ఫ్లోర్

ఈ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్ 28,993 చ.అ. విస్తీర్ణం ఖాళీగా ఉంది. అదేవిధంగా ఏడో అంతస్థులో టెర్రస్ ఇంకా ఎవరికీ ఇవ్వలేదు. అక్కడ రెస్టారెంట్‌కు ఇవ్వాలనేది ఆలోచన. ఇక మిగిలిన ... మిగతా 6వ పేజీలో

కేజీహెచ్‌లో అనధికార బాయ్‌ల దందా



- రోగుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు
- ఇవ్వని వారిపై దాడి
- తాజాగా విజయనగరానికి చెందిన ఓ రోగిపై పిడిగుద్దులు
- ఆస్పత్రి అధికారులకు, వన్‌టౌన్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

మహరాణిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): **కేజీహెచ్‌లో అనధికార వార్డు బాయ్‌ల దందా ఎక్కువైంది. అత్యవసర విభాగం వద్ద రోగులకు సహాయం చేస్తున్నట్టు నటించి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వని వారిపై దాడులకు తెగబడుతున్నారు. ఇలాగే రెండు రోజుల క్రితం ఒక రోగిపై పిడిగుద్దులు కురిపించారు.**



కేజీహెచ్‌లో అత్యవసర విభాగం

విజయనగరం జిల్లా బొద్దాం ప్రాంతానికి చెందిన దమ్ము పేరయ్య (70) అస్వస్థతకు గురవ్వడంతో ఆయన కుమారుడు ఈశ్వరరావు, బంధువులు ఈ నెల 11వ తేదీ రాత్రి ఏడు గంటల ప్రాంతంలో కేజీహెచ్‌కు తీసుకువచ్చారు. వారిని ఆస్పత్రిలోని అత్యవసర విభాగం వద్ద ఉన్న అనధికార వార్డు బాయ్ (పేరు దిలీప్) క్యాజువాలిటీ లోపలకు తీసుకువెళ్లాడు. అక్కడ డ్యూటీలో ఉన్న వైద్యుల వద్దకు తీసుకువెళ్లి చూపించినట్టు నటించాడు. అనంతరం రోగి బంధువుల వద్ద నుంచి రూ.700 డిమాండ్ చేశాడు. తాము అంత ఇచ్చుకోలేమని ఈశ్వరరావు చెప్పగా, అతనితో వార్డు బాయ్ వాగ్వాదానికి దిగాడు. పేరయ్యతో పాటు ఈశ్వరరావుపై దాడికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న కొందరు వార్డు బాయ్‌పై డ్యూటీలో ఉన్న చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ)కు ఫిర్యాదు చేశారు. జరిగిన తప్పిదాన్ని తెలుసుకున్న ఆయన...పేరయ్యను క్యాజువాలిటీ లోపలకు తీసుకువెళ్లి ప్రత్యేక బెడ్ ఇచ్చి, ఉదయం వరకు చికిత్స అందించారు. ఈ దాడిపై బాధితుడు ఈశ్వరరావు శుక్రవారం ఉదయం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి, వన్ టౌన్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఇటువంటి సంఘటనలు నిత్యకృత్యం

కేజీహెచ్ క్యాజువాలిటీ వద్ద ఇటువంటి సంఘటనలు నిత్యకృత్యమయ్యాయి. క్యాజువాలిటీ వద్ద సుమారు పది మంది వరకూ అనధికార వార్డు బాయ్‌లు ... మిగతా 6వ పేజీలో

డైట్‌కు మహర్దశ

జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థలను ఆధునికీకరించాలని ప్రభుత్వం నిర్ణయం

- 'డైట్స్ ఆఫ్ ఎక్సలెన్స్'గా అభివృద్ధి
- భీమిలి సెంటర్‌కు రూ.13.65 కోట్లు మంజూరు
- తరగతి గదులు, పాలనా భవనం, హాస్టల్ భవనాలు కొత్తవి నిర్మాణం
- పూర్తిస్థాయిలో సదుపాయల కల్పన
- రెండేళ్లలో పూర్తికి నిర్ణయం



శిథిలావస్థకు చేరిన డైట్ భవనాలు

విశాఖపట్నం/భీమిలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): **ఉమ్మడి ఏపీలో తొలి తరం జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్)లలో ఒకటైన భీమిలి డైట్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరించనున్నారు. తరగతి గదులు, హాస్టల్ భవనాలు, పాలనా భవనం కొత్తవి నిర్మించనున్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.13.65 కోట్లు మంజూరుచేసింది.**

రాష్ట్రంలో ఉపాధ్యాయ శిక్షణ సంస్థలను బలోపేతం చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం, దశల వారీగా వాటిని అభివృద్ధి చేస్తోంది. డైట్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలనే యోచనతో తొలిదశలో మూడింటికి నిధులు ఇచ్చింది. మలి దశలో గుంటూరు, నెల్లూరు, విశాఖపట్నం జిల్లాల్లో డైట్స్‌కు నిధులు ఇచ్చింది. సుమారు 11 ఎకరాల్లో ఉన్న భీమిలి డైట్‌లో చాలావరకు భవనాలు శిథిలావస్థకు చేరాయి. దాంతో కొన్ని భవనాలను వినియోగించకుండా తాళాలు వేశారు. ఉన్న భవనాలు సరిపోకపోవడంతో నిర్వహణకు కొంత వరకు ఇబ్బంది ఏర్పడుతున్నది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనాలను పూర్తిగా తొలగించనున్నారు. హాస్టల్స్ ఉన్నచోట కొంత వరకు డైట్ భూమి ఆక్రమణలకు గురైంది. ఆక్రమణలు తొలగించి ప్రహరీ నిర్మించాల్సి అవసరం ఉందని ఇంజనీరింగ్ విభాగం అంచనా వేసింది.

మూడు తరగతి గదులతో అడకమిక్ బ్లాక్, ఎనిమిది గదులతో పాలనా బ్లాక్, ఆడిటోరియం, నాలుగు గదులతో లేబొరేటరీ, కంప్యూటర్ గది, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్, స్పెషల్ ఎడ్యుకేషన్ సెంటర్‌ల నిర్మాణానికి రూ.4.8 కోట్లు కేటాయించారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా వసతి గృహాల నిర్మాణానికి రూ.3.6 కోట్లు, మరుగుదొడ్లకు రూ.45 లక్షలు ... మిగతా 6వ పేజీలో

స్పా ముసుగులో వ్యభిచారం

- గాజువాక ఎస్ఎస్ థాయ్ స్పాపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి
- అదుపులో ఏడుగురు...



గాజువాకలోని ఎస్ఎస్ థాయ్‌స్పా

విశాఖపట్నం/గాజువాక, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యభిచారం నిర్వహిస్తున్న స్పా సెంటర్‌పై సిటీ టాస్క్‌ఫోర్స్, గాజువాక పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. నిర్వాహకురాలితోపాటు ఒక విటుడు, ఐదుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక చైతన్యనగర్‌లో గల 'ఎస్ఎస్ థాయ్ స్పా'లో మసాజ్ పేరిట వ్యభిచారం ... మిగతా 6వ పేజీలో

జోరుగా పేదల పట్టాల రిజిస్ట్రేషన్లు

- ప్రభుత్వ భూముల్లో ఉన్న వారికి 2018లో పట్టాలు ఇచ్చిన టీడీపీ ప్రభుత్వం
- ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కన్వేయన్స్ డీడ్ పట్టాల రిజిస్ట్రేషన్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిని గుర్తించి తెలుగుదేశం ప్రభుత్వం 2018లో భారీ సంఖ్యలో ఏయూ మైదానంలో మహిళల పేరుతో పట్టాలు అందజేసిన సంగతి తెలిసిందే. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేయలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక లబ్ధిదారులు వాటిని అవసరమైతే అమ్ముకోవడానికి వీలుగా రిజిస్ట్రేషన్లు చేయాలని ఎమ్మెల్యేలను కోరుతూ వస్తున్నారు. ఈ విషయం జిల్లా సమీక్షా మండలి సమావేశంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, పి.గణబాబులు పలుమార్లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో అభ్యంతరం లేని పట్టాలు అంటే గెడ్డలు, వాగులు, చెరువులు కాకుండా మిగిలిన భూముల్లో ఆక్రమణదారులకు ఇచ్చిన పట్టాలను ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు వారి జాబితాను జిల్లాలో ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపించారు. జిల్లాలో మొత్తం 24,463 మందికి రిజిస్ట్రేషన్లు చేయాలని నిర్ణయించారు. ఏ ప్రాంతాల లబ్ధిదారులు ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలో సూచించారు.

భీమిలి మండలంలో 177 మంది లబ్ధిదారులు భీమిలిలో, విశాఖ గ్రామీణ మండలం (చినగదిలి) లబ్ధిదారులు 8,157 మంది ఆనందపురం, మధురవాడ, సూపర్ బజార్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో, ములగాడకు చెందిన 5,183 మంది గాజువాక, పెదగంట్యాడ ... మిగతా 6వ పేజీలో



సూపర్ బజారు ఆవరణలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పట్టాల రిజిస్ట్రేషన్‌కు వచ్చిన లబ్ధిదారులు

మధురవాడకు మహర్దశ

- కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గంటా

కొమ్మాది, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ ప్రాంతానికి మహర్దశ పట్టనుందని, త్వరలోనే రూ. వెయ్యి కోట్లతో రెండు కీలక ప్రాజెక్టుల పనులు మొదలు కానున్నాయని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన ఆరో వార్డు కొమ్మాది రోడ్డులోని వైభవ్‌నగర్‌లో రూ. 1.70 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ. 535 కోట్ల ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) నిధులతో 38 ఎంఎల్‌డీ సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంటు 400 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్నట్టు చెప్పారు. ఇందులో రూ. 498 కోట్లు ఐఎఫ్‌సీ ఇవ్వనుండగా మిగిలిన మొత్తాన్ని జీవీఎంసీ భరిస్తుందని తెలిపారు. మధురవాడకు భవిష్యత్‌లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా రూ. 500 కోట్లతో భారీ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఇవి కాకుండా రూ. 120 కోట్లతో రోడ్లు, కాలువలు, కల్వర్టులు నిర్మించనున్నట్టు చెప్పారు. భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభమైన తరువాత మధురవాడ ప్రాంతం మరింతగా అభివృద్ధిగా చెందుతుందని తెలిపారు. భీమిలిలో ప్రధానమైన మూడు రోడ్ల విస్తరణతో పాటు భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాలు జీవీఎంసీలో విలీన ప్రతిపాదనలు త్వరలో కార్యరూపం దాల్చనున్నాయని వెల్లడించారు. ఈవిషయమై కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్‌తో మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ త్వరలో సమావేశం కానున్నారని చెప్పారు. అనంతపురంలో కూటమి సభ విజయవంతం కావడంతో మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు మతిభ్రమించిందని విమర్శించారు. జగన్ ప్రారంభించిన 17 మెడికల్ కళాశాలల్లో అయిదు మాత్రమే పూర్తయ్యాయని, రుషికొండ ప్యాలెస్ నిర్మాణానికి ఖర్చు చేసిన రూ. 500 కోట్లతో నర్సీపట్నం మెడికల్ కాలేజీని పూర్తి చేయవచ్చునని తెలిపారు. కాగా వైసీపీ హయాంలో వైభవ్‌నగర్‌లో రెండు పార్కుల గేట్లకు తాళాలు వేసి ఉంచిన విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే తాళాలు తీసి నిర్వహణ బాధ్యతను కాలనీ అసోసియేషన్‌కు అప్పగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ కనకమహలక్ష్మి, కార్పొరేటర్లు మొల్లి హేమలత, లొడగల అప్పారావు, దాసరి శ్రీనివాస్, లొడగల జానకీరామ్, సోడిపల్లి నారాయణరావు, కానూరి అచ్చుతరావు, శాఖరి శ్రీనివాస్, పిళ్లా వెంకట్రావు, మొల్లి లక్ష్మణరావు, నాగోతి సత్యనారాయణ, మామిడి దుర్గారావు, చెట్టుపల్లి గోపి, బోయి వెంకటరమణ, రమాదేవి పాల్గొన్నారు.


యువ న్యాయవాదులతో ప్రముఖులు

ఉత్సాహంగా మూట్ కోర్టు పోటీలు

మధురవాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) :యువ న్యాయవాదులు కోర్టు తీర్పులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని వైజాగ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంకే శ్రీనివాస్ సూచించారు. మధురవాడలోని ఎస్‌వీపీ లా కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే నేషనల్ మూట్ కోర్టు పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ పోటీలకు దేశంలోని 14 రాష్ట్రాలకు చెందిన 30 న్యాయ సంస్థలు, లా కళాశాలలకు చెందిన విద్యార్థులు, ప్రముఖ లాయర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ యువ న్యాయవాదులు సీనియర్ల నుంచి ప్రతి అంశం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఎస్‌వీపీ లా కళాశాల చైర్మన్ సుంకరి రవీంద్ర మాట్లాడుతూ తమ కళాశాల దేశానికి ఎందరో ప్రముఖ లాయర్లను అందించిందన్నారు. కాగా మొదటి రోజు పోటీల్లో పలువురు యువ న్యాయవాదులు తమ అనుభవాలను మూట్ కోర్టులో ప్రదర్శించారు. ఆదివారం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికా దాస్, విజయ రవీంద్ర, సీనియర్ న్యాయవాది రవీంద్ర ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ అలక్ చంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతోనే విజయం


ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజును సన్మానించిన ఉపాధ్యాయులు

తగరపువలస, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు లక్ష్య సాధనతో పాటు కృషి, పట్టుదల కూడా ఉండాలని ఏయూ సైకాలజీ విభాగం అధిపతి డా. ఎంవీఆర్ రాజు అన్నారు. శనివారం ఆయన చిట్టివలస బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు భయం లేకుండా ఉండాలని, అనుకున్నది సాధించడానికి ప్రయత్నించాలని చెప్పారు. మన స్థాయిని మనమే అంచనా వేసుకోవాలని, ఇతరుల మాటలకు విలువ ఇవ్వనవసరం లేదన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు జి. మోహనరావు అధ్యక్షతన ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు రాజును సన్మానించారు. కార్యక్రమంలో రేఖ అప్పారావు, డి. ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విల్సన్‌పేటలో క్రీడా పోటీలు

తగరపువలస, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఒకటవ వార్డు పరిధిలోని విల్సన్‌పేటలో నందీశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక మహిళలకు, విద్యార్థులకు శనివారం పలు క్రీడా పోటీలు నిర్వహించారు. వినాయక ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ పోటీలను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

5 నుంచి ఐశ్వర్య వెంకన్న పవిత్రోత్సవాలు

భీమునిపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 5 నుంచి 8వ తేదీ వరకూ పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, సూర్యనారాయణమూర్తి తెలిపారు. శనివారం వారు ఆలయంలో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఇళ్ల పట్టాల క్రమబద్ధీకరణకు డబ్బులు వసూలు ?

సాగర్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) :రుషికొండ స్వర్ణభారతి నగర్ సచివాలయం పరిధిలో 55 మంది లబ్ధిదారుల నుంచి రెవెన్యూ సిబ్బంది ఇళ్ల పట్టాల క్రమబద్ధీకరణకు డబ్బులు వసూలు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కాలనీలో 55 మంది నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చింది. వాటికి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి లబ్ధిదారుల నుంచి రెవెన్యూ సిబ్బంది ఇళ్ల పట్టాల కలర్ జిరాక్సులు స్వీకరిస్తున్నారు. ఈమేరకు శనివారం ఉదయం పెద్ద రుషికొండ సచివాలయంలో సిబ్బంది లబ్ధిదారుల నుంచి పట్టాల కలర్ జిరాక్సులు తీసుకున్నారు. పట్టా, ఆధార్ కార్డు జెరాక్స్‌తో పాటు రూ. 3 వేల చొప్పున వసూలు చేశారు. ఈ విషయం తెలిసిన విలేకరులు అక్కడికి వెళ్లగా సిబ్బంది కార్యక్రమాన్ని నిలిపివేశారు. కాగా జరిగిన సంఘటనపై చినగదిలి రూరల్ తహశీల్దార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రూ. 8 లక్షల జరిమానా

ఆనందపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన 81 మందికి భీమిలి కోర్టు రూ.10 వేలు చొప్పున మొత్తం రూ. 8.10 లక్షల జరిమానా విధించింది. ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 81 మందిపై కేసులు నమోదు చేశారు.వారిని శనివారం భీమిలిలో 2వ అదనపు జూనియరు సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ పి. స్వాతిభవానీ ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున అపరాధ రుసుం విధించారు.

డెక్‌కు బోలెడు డిమాండ్

... 5వ పేజీ తరువాయి

ఒకే ఒక ఫ్లోర్‌ను నక్కపల్లిలో స్టీల్‌ప్లాంటును ఏర్పాటుచేస్తున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ లిమిటెడ్ కంపెనీ తమ కార్యాలయం కోసం ఇవ్వాలని కోరింది. తమకు కావాలని బెంగళూరుకు చెందిన డిజిటల్ సొల్యూషన్స్ ఐటీ కంపెనీ కోవలెన్స్ అమరావతి నుంచి చెప్పించింది. అదేవిధంగా మరో ఫార్మా కంపెనీ కూడా అదే ఫ్లోర్ కావాలని రికమెండేషన్ చేయించుకుంది. ఒకరికి ఇస్తే మిగిలిన ఇద్దరికి మొండి చేయి చూపించినట్టవుతుందని, బహిరంగ వేలం నిర్వహిస్తామని, ఎవరికి కావాలంటే వారు పాడుకోవాలని వీఎంఆర్‌డీఏ తేల్చి చెప్పింది. ఈ నెల 19న ఖరారవుతుంది.

జోరుగా పేదల పట్టాల రిజిస్ట్రేషన్లు

... 5వ పేజీ తరువాయి

కార్యాలయాల్లో, సీతమ్మధార మండలానికి చెందిన 381 మంది ద్వారకానగర్ కార్యాలయంలో, పెందుర్తి మండలానికి చెందిన 2,969 మంది పెందుర్తి కార్యాలయంలో, గోపాలపట్నం ప్రాంతానికి చెందిన 2,147 మంది గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సూచించారు. వారి నుంచి ఏ శాఖ సిబ్బంది అయినా లంచాలు ఆశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హెచ్చరించారు.

స్పా ముసుగులో వ్యభిచారం

... 5వ పేజీ తరువాయి

నిర్వహిస్తున్నారు. మసాజ్ చేయడానికి అని చెప్పి ఉద్యోగంలోకి తీసుకున్న మహిళలను బలవంతంగా అందుకు ఉపయోగిస్తున్నారు. దీనిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో శనివారం గాజువాక పోలీసులతో కలిసి దాడి చేశారు. నిర్వాహకురాలితోపాటు విటుడిని అరెస్టు చేశారు. మహిళలను పునరావాస కేంద్రానికి అప్పగించారు.

198 మందికి నేత్ర వైద్య పరీక్షలు


రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

భీమునిపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ది సన్ స్కూల్ ఆవరణలో ఆ పాఠశాల యాజమాన్యం, భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యులు 198 మంది రోగులను పరీక్షించి 40 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. అలాగే 34 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు, శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్యులు డి. కృష్ణ దీపక్, ది సన్ స్కూల్ డైరెక్టర్ లక్ష్మీ లావణ్య, క్యాంప్ కో ఆర్డినేటర్ వై. పైడిరాజు, బీఎన్‌డబ్ల్యూ సభ్యులు ముసునూరి సూర్య శ్రీనివాసరావు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, వాండ్రాసి సతీశ్, కాళ్ల సన్నీ, ముమ్మిడిశెట్టి ఆదిత్య, శివదాలయ్య, కాకర్ల సురేశ్, సన్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి హైదరాబాద్‌కు చెందిన పసుపులేటి రాము దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో అన్నప్రసాద విభాగం పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావుకు శనివారం వారు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాతకు అధికారులకు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రాలు, వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

లోక్ అదాలత్‌లో 916 కేసులు పరిష్కారం


జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్

భీమునిపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని భీమిలి కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 916 పరిష్కారమయ్యాయి. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మెజిస్ట్రేట్ డి. సౌజన్య, 1వ అదనపు, 2వ అదనపు జూనియరు సివిల్ జడ్జి కోర్టుల్లో మెజిస్ట్రేట్ పి. స్వాతి భవానీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పీఎంపాలెం పోలీసుస్టేషన్ల పరిధిలోని పలు కేసుల్లో ఇరువర్గాలు రాజీకి రావడంతో పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు అడ్వకేట్ ఎంవీ పార్వతీశం, కేఎస్ఎం సుధాకర్, డి. ఈశ్వరరావు, కె. మంజుల, శంకర్‌కుమార్, పప్పు భరద్వాజ్ పాల్గొన్నారు.

మరో ఛార్జింగ్ యూనిట్ ఏర్పాటు

సాగర్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులో సాగర్‌నగర్ వద్ద డబుల్ డెక్కర్ బస్సుల కోసం ఏర్పాటు చేసిన ఛార్జింగ్ స్టేషన్‌లో అదనంగా మరో ఛార్జింగ్ యూనిట్ శనివారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఆర్కేబీచ్ నుంచి తొట్లకొండ వరకు జీవీఎంసీ స్మార్ట్ సిటీ విభాగం ఈవీ డబుల్ డెక్కర్ బస్సులు నడుపుతున్న విషయం విదితమే. ఈమేరకు అదనంగా ఏర్పాటు చేసిన ఛార్జింగ్ స్టేషన్‌తో బీచ్ రోడ్డులో నడిచే ఈవీ వాహనాలకు తక్కువ రుసుముతో ఛార్జింగ్ సదుపాయం కల్పించే ఆలోచనలో అధికారులు ఉన్నట్టు తెలిసింది.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి

సింహాచలం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు కార్పొరేటర్ పీవీ నరసింహం శనివారం వినతిపత్రం అందజేశారు. ఈమేరకు ఆయన కమిషనర్‌ను జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కలిశారు. వార్డులోని గోశాల కూడలి నుంచి సాయినగర్ వరకు బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకుని రిటైనింగ్ వాల్ నిర్మించాలని, ప్రియాగార్డెన్స్, పాత అడివివరంలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని కోరారు. అలాగే సింహాచలం, విజినిగిరిపాలెం, అడివివరం గ్రామాల్లోని శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని విన్నవించారు.

నేడు రేవిడిలో మెహర్ బాబా కేంద్రం వార్షికోత్సవం

పద్మనాభం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేవిడిలో ఆదివారం అవతార్ మెహర్ బాబా కేంద్రం 17వ వార్షికోత్సం నిర్వహించనున్నట్టు కేంద్రం వ్యవస్థాపకుడు ఎంఎస్ బాపిరాజు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రేమిక సహవాస్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రేవిడి జెడ్పీ పాఠశాల హెచ్ఎం వి. శంకరరావు సప్తవర్ణ పతాకావిష్కరణ చేసి, ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడతారని చెప్పారు.

కొండమేకపై కుక్కల దాడి


గాయాలతో అపార్టుమెంట్ సెల్లార్‌లో దాక్కున్న కొండ మేక

కొమ్మాది, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కంబాల కొండ అటవీ ప్రాంతం నుంచి శనివారం సాయంత్రం శంభువానిపాలెం చెక్ పోస్టు ద్వారా ఓ కొండమేక జనావాసాల్లోకి వచ్చింది. దాన్ని చూసి కుక్కలు అరవడంతో భయపడి షిప్‌యార్డు కాలనీ వైపు పరుగులు తీసింది. అటువైపు నుంచి కూడా కుక్కలు వెంట పడి దాడి చేయడంతో గాయాలతో సమీపంలోని ఎంవీపీ ప్లాజా అపార్టుమెంట్ సెల్లార్‌లోకి ప్రవేశించింది. కొండ మేకను చూసిన అపార్టుమెంట్ నివాసి సీతారామ్మూర్తి గేటు వేసి, కుక్కలు లోపలికి రాకుండా అడ్డుకోవడంతో పాటు మేకకు మంచినీరు, ఆహారం అందించారు. ఈ విషయాన్ని ఆయన సామాజిక మాధ్యమంలో పోస్టు చేయడంతో అటవీ శాఖాధికారులకు సమాచారం తెలిసింది. ఈమేరకు రేంజ్ అధికారి శాస్త్రి, బీట్ గార్డు ఎల్లారావు, జూ వైద్యుడు భాను ప్రతాప్ అక్కడికి చేరుకున్నారు. అత్యవసర చికిత్స అనంతరం కొండమేకను ప్రత్యేక వాహనంలో జూపార్కుకు తరలించారు.

రాడిసన్ బ్లూలో వసుంధర డైమండ్స్ మెగా ఎగ్జిబిషన్ ప్రారంభం


గిరిజన విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు ఇస్తున్న సంస్థ సభ్యులు

సాగర్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో వసుంధర డైమండ్స్ మెగా ఎగ్జిబిషన్ శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా వసుంధర డైమండ్ రూఫ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. వసుంధర మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ జరుగుతుందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలంలోని తుమ్మలోవ గిరిజన గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు పిల్లలకు చదువు, ఉచిత వైద్య శిబిరాలు వంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ తొట్టెంపూడి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పార్కుకు ఎసరు!

... 5వ పేజీ తరువాయి

కేటాయించిన భూమి తమదని, ఆ భూమిని తమ కుటుంబ పెద్దలు విక్రయించలేదంటూ నకిలీ పత్రాలను తయారుచేశారు. పార్కులో చిన్నపాటి షెడ్ వేసి తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు యత్నించారు. ఈ విషయం కొందరు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా...వారు పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేశారు. పార్కులోని ఆక్రమణలను తొలగించి చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ వేశారు. అయితే ఇప్పుడు రుషికొండ ప్రాంతంలో భూములు, స్థలాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఆ ప్రాంతంలో చదరపు గజం ధర రూ.80 వేలు వరకు పలుకుతోంది. దీనినిబట్టి 2,400 గజాల స్థలం విలువ దాదాపు రూ.20 కోట్లు ఉంటుంది. అంతటి ఖరీదైన పార్కు స్థలాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవాలనే నిశ్చయంతో వైసీపీ చోటానేత తిరిగి తన ప్రయత్నాలను ప్రారంభించారు. గతంలో లేఅవుట్‌కు భూములు విక్రయించిన వారి వారసుల పేరుతో కొందరిని కూడగట్టారు. పార్కు స్థలం తమది అంటూ సృష్టించిన నకిలీపత్రాలను చూపించి ఆ స్థలం విక్రయించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ స్థలంలోకి ఇతరులెవరూ అడుగు పెట్టకుండా కొందరు రౌడీలను ఏర్పాటుచేశారు. ఆ భూమికి ఎలాంటి తగాదాలు లేవని చెప్పి ఇటీవల ఒకరికి విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగా రూ.కోటి అడ్వాన్సుగా వైసీపీ చోటా నేత అందుకున్నట్టు స్థానికులు పేర్కొంటున్నారు.

జీవీఎంసీ అధికారులకు దీనిపై సమాచారం ఇచ్చినా స్పందించలేదని ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ జోన్-2 అధికారులు స్పందించి కబ్జారాయుళ్లకు ముకుతాడు వేయకపోతే పార్కు స్థలం అన్యాక్రాంతం అయిపోవడం ఖాయమని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.


పోటీలో పాల్గొన్న క్రీడాకారులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మధురవాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మార్షల్ ఆర్ట్స్‌తో మహిళలు, బాలికలు ఆత్మరక్షణ పొందవచ్చునని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శిల్పారామంలో ఏపీ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆనంద్ మార్షల్ ఆర్ట్స్ నిర్వహిస్తున్న 9వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ వల్ల దేహ దారుఢ్యం పెరగడంతో పాటు మహిళలు, యువతుల్లో ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుందన్నారు. ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగుపడతాయని తెలిపారు. కాగా రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయగోదావరి, కాకినాడ, ఎన్టీఆర్ జిల్లా, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు బసవబోయిన ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బాబూరావు, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అప్పన్న ఆభరణాల తనిఖీ

సింహాచలం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి స్వర్ణ, రజిత ఆభరణాల తనిఖీ ముగిసినట్టు ఫైవ్ మెన్ కమిటీ హెడ్, విజయనగరం జిల్లా దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు. భక్తులు కానుకలుగా అందజేసిన ఆభరణాలలో వ్యత్యాసాలు ఉన్నట్టు కడపకు చెందిన స్వచ్ఛంద సేవా కార్యకర్త కె.ప్రభాకరాచారి తొలుత దేవదాయ శాఖ కమిషనర్‌కు, ఆ తర్వాత విశాఖ జిల్లా కలెక్టర్‌కు, అదే విధంగా దేశ ప్రధానికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు దేవదాయ శాఖ కమిషనర్..కాకినాడకు చెందిన ఆర్‌జేసీ సుబ్బారావును విచారణాధికారిగా నియమించగా ఆయన అదే శాఖకు చెందిన జ్యూవెలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజును పంపించారు. ఆయన తన నివేదికను రాష్ట్ర అధికారులకు సమర్పించారు. దానిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండానే మరొకసారి సమగ్ర విచారణకు ఫైవ్ మెన్ కమిటీని దేవదాయ శాఖ కమిషనర్ నియమించారు. కమిటీ సభ్యులు ఇటీవల ఐదు రోజులపాటు దేవాలయ భాండాగారంలో, సింహాచలంలోని జాతీయ బ్యాంకుల్లో ఉన్న ఆభరణాలను రికార్డుల్లో ఉన్న వివరాలతో సరిపోల్చి చూశారు. అనంతరం శుక్రవారం అర్ధరాత్రి వరకూ నివేదికలు రహస్యంగా తయారుచేసి, దానిపై కమిటీ సభ్యులంతా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కమిటీకి సారథ్యం వహిస్తున్న ప్రసాద్ మాట్లాడుతూ నివేదికను అతి త్వరలోనే దేవదాయ శాఖ కమిషనర్‌కు అందజేస్తామని తెలిపారు. ఆభరణాల లెక్కలన్నీ దాదాపు సరిపోయినట్టేనని చెప్పారు.

స్థానికులకు ఉక్కు మొండిచెయ్యి

... 5వ పేజీ తరువాయి

విభాగంలోనైనా పనిచేసుకోవచ్చు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ఇప్పుడు ఈ సేఫ్టీ పాస్‌లు ఇస్తున్నారు. అంటే తొలగించిన 4,500 కాంట్రాక్ట్ వర్కర్లలో ఎవరికీ పనిచేసే అవకాశం ఇవ్వకుండా పొరుగు రాష్ట్రాల వారిని తెప్పించి పనిచేయిస్తున్నారు. దీనిపై కాంట్రాక్ట్ వర్కర్ల సంఘం శనివారం ఆందోళనకు దిగింది. శిక్షణ కార్యాలయం ముందు నిరసన వ్యక్తంచేసింది. స్టీల్ ప్లాంటుకు భూములు ఇచ్చిన నిర్వాసితులకు, ఆ తరువాత ఇక్కడి స్థానికులకు ప్లాంటులో పనిచేసే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత నాలుగు దశాబ్దాలుగా ఆ నిబంధన అమలవుతున్నదని, ఇప్పుడు దానిని పక్కన పెట్టి పొరుగు రాష్ట్రాల వారితో పనిచేయిస్తున్నందున తాము ఆందోళనలు ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. మే నెలలో తొలగించిన కాంట్రాక్టు వర్కర్లలో 300 మంది నిర్వాసితులు ఉన్నారని, వారిని వీలైనంత త్వరగా మళ్లీ తీసుకుంటామని ఇటీవల జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కు సీఎండీ సక్సేనా హామీ ఇచ్చారని, దానిని తుంగలో తొక్కారని, స్థానికులకు అన్యాయం చేస్తున్నారని సంఘ నాయకులు ఆరోపించారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులకు పనులు ఇవ్వాలని, లేదంటే నిరవధికంగా ఆందోళనలు కొనసాగిస్తామని నాయకులు ప్రసాద్, పరంధామయ్య, వంశీకృష్ణ ప్రకటించారు.

కేజీహెచ్‌లో అనధికార బాయ్‌ల దందా

... 5వ పేజీ తరువాయి

ఉంటున్నారు. వారిలో కొందరు మద్యం సేవించి ఉంటారు. అంబులెన్స్ కాని, ఇతర ఏదైనా వాహనంలో రోగిని తీసుకువస్తే వెంటనే వారు అక్కడకు చేరుకొని, అవసరమైన వీల్ ఛైర్,వీల్ బెడ్‌లు సమకూర్చి రోగిని లోపలకు తీసుకువెళతారు. అక్కడ ఉన్న డ్యూటీ డాక్టర్లకు చూపించినట్టు నటించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఎవరైనా డబ్బులు ఇవ్వకుంటే దాడి పాల్పడుతున్నారు. చాలా ఏళ్లుగా ఈదందా కొనసాగుతోంది. రోగులు, వారి బంధువులపై దాడులకు పాల్పడిన సంఘటనలు కోకొల్లలు. ఈ విషయం ఆస్పత్రిలోని ఉన్నతాధికారులకు తెలిసినా ఎటువంటి చర్యలూ తీసుకోరు. కాగా క్యాజువాలిటీలో పోలీసు అవుట్ పోస్టు ఉన్నా.. ఈ దందా గురించి పట్టించుకోకపోవడం గమనార్హం. అనధికార వార్డు బాయ్ దాడి గురించి ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంఓ సీహెచ్ శ్రీహరి వద్ద ప్రస్తావించగా బాధితుడు ఈశ్వరరావు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. అనధికార వ్యక్తులను ఆస్పత్రి నుంచి బయటకు పంపించేశామని, సోమవారం నుంచి మరిన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

19న డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుకు విద్యా శాఖ సన్నాహాలు చేస్తోంది. ఉత్తరాంధ్రలో 2,660 మందికి నియామక పత్రాలు అందజేస్తారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ, గురుకులాలు/మోడల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, టీజీటీ, పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు తోడుగా కుటుంబ సభ్యుల్లో ఒకరిని అభినందన సభకు అనుమతిస్తారు. ఉత్తరాంధ్ర నుంచి అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను తీసుకువెళ్లడానికి సుమారు 120 బస్సులు ఏర్పాటుచేస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి ఈనెల 18వ తేదీ ఉదయం బస్సులు బయలుదేరతాయి. ఆరోజు రాత్రికి విజయవాడ సమీపంలో వారికి వసతి ఏర్పాటుచేస్తారు. 19వ తేదీ ఉదయం అభినందన సభలో జిల్లాల నుంచి ఎంపిక చేసిన కొద్దిమందికి సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఇతర ప్రముఖులు నియామక పత్రాలు అందజేస్తారు. మిగిలిన వారికి అదే ప్రాంగణంలో ఏర్పాటుచేసే కౌంటర్ల ద్వారా పత్రాలు ఇవ్వనున్నారు. అభినందన సభ ముగిసిన తరువాత తిరిగి అవే బస్సుల్లో జిల్లాలకు తీసుకువస్తారు. ఆ తరువాత ఎంపికైన అభ్యర్థులకు పాఠశాలల నిర్వహణ, బోధన, పరిపాలన, ఇతర అంశాలపై జిల్లాల వారీగా పది రోజులపాటు శిక్షణ ఇస్తారు. ఇప్పటివరకూ డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లను కౌన్సెలింగ్‌లోనే పాఠశాలలు కేటాయించేసేవారు. ఈ పర్యాయం పది రోజుల శిక్షణ ఇచ్చిన తరువాత పాఠశాలలకు పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఉద్యోగికి శిక్షణ అవసరమని విద్యా శాఖ అధికారి ఒకరు తెలిపారు. దసరా సెలవులు తరువాత కొత్త టీచర్లకు పాఠశాలలు కేటాయించనున్నట్టు పేర్కొన్నారు.

డైట్‌కు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

కేటాయించారు. ఇంకా ఆడియో విజువల్ ఎయిడ్స్ డిజిటల్ హార్డ్‌వేర్ అండ్ సాఫ్ట్‌వేర్, ఇంటర్‌నెట్ సౌకర్యం, ప్రత్యేకించి వెబ్‌సైట్ రూపకల్పన, స్మార్ట్ తరగతుల నిర్మాణానికి రూ.1.16 కోట్లు, ప్రహరీ గోడ, సెక్యూరిటీ పోస్టు నిర్మాణం, సీసీ టీవీ, ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్ ఏర్పాటుకు రూ.0.91 కోట్లు, డైట్ అధ్యాపకుల కోసం క్వార్టర్ల నిర్మాణాలకు రూ.1.03 కోట్లు వెచ్చించనున్నారు. అలాగే తాగునీటి సదుపాయం, క్యాంటీన్ భవనం, గార్డెనింగ్, ఫర్నీచర్, వాహనాల పార్కింగ్, సోలార్ ఎక్విప్‌మెంట్, క్రీడలకు సంబంధించి పరికరాలు, నిర్వహణ తదితర అంశాలకు రూ.1.67 కోట్లు కేటాయించారు. నూతన భవనాల నిర్మాణం, ఇతరత్రా వసతుల కల్పనకు టెండర్లు ఆహ్వానించారు. రెండు సంవత్సరాల్లో భవనాలు నిర్మించి వసతులు కల్పించాలని సమగ్ర శిక్షా ఉన్నతాధికారులు నిర్ణయించారు.

చికిత్స పొందుతూ నేవీ ఉద్యోగి మృతి

ఈ నెల 10న విధులు నిర్వహిస్తుండగా క్వార్టర్స్ ఆర్చ్ పెచ్చులు పడి గాయాలు

మద్దిలపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈస్ట్‌పాయింట్ కాలనీలోని నేవీ క్వార్టర్స్ ఆర్చ్ శ్లాబు పడి గాయాలైపాలైన నేవీ ఉద్యోగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. నేవల్ అధికారి ఫిర్యాదు మేరకు శనివారం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఢిల్లీ నేవీ జవాన్‌గా పని చేస్తున్న చంద్రమోహన్‌ది ఉత్తరాఖండ్. అతడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. చంద్రమోహన్ ఢిల్లీ నుంచి ఈనెల 6న బదిలీపై నగారానికి వచ్చి విధుల్లో చేరాడు. 10న ఈస్ట్ పాయింట్ కాలనీ నేవల్ క్వార్టర్స్ వద్ద రాత్రి సెంట్రీ విధులు నిర్వహిస్తుండగా, రాత్రి 10.30 గంటల సమయం లో క్వార్టర్స్ ఆర్చ్ శ్లాబు అతడిపై విరిగిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న మరో జవాన్, క్వార్టర్స్ నివాసులు వెంటనే అతడిని కల్యాణి ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చంద్రమోహన్ శుక్రవారం మృతి చెందాడు. దీనిపై శనివారం నేవల్ అధికారులు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : లాసన్స్‌బే కాలనీ వద్ద ఈ నెల 4వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందారు. ఎస్‌ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇసుకతోట రామాలయం ప్రాంతానికి చెందిన అలుపన శ్యామ్‌సుందర్ (36) ఈ నెల 4న తెల్లవారు జామున స్కూటీపై వెళుతూ డివైడర్‌ను ఢీకొట్టి పడిపోయారు. అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో అతడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

గాజువాక, సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): ఇక్కడి జగ్గు జంక్షన్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పి.విజయలక్ష్మి (60) అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. చినగంట్యాడ ప్రాంతానికి చెందిన చింతకాయల వాణి స్కూటీపై తన తల్లి విజయలక్ష్మి, కుమార్తె తమన్వితో కలిసి సుందరయ్యకాలనీ వైపు వెళ్తుంది.ఈ క్రమంలో జగ్గు జంక్షన్ దాటాక పెద్ద గొయ్యిని తప్పించేందుకు గాను స్కూటీని కుడివైపు మళ్లిస్తుండగా వెనుకే వస్తున్న భారీ వాహనం ఢీకొంది. దీంతో విజయలక్ష్మి రోడ్డు మధ్యలో పడిపోగా, ఆమె పై నుంచి వాహనం వెళ్లడంతో మృతి చెందింది. వాణి, తమన్వీలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమ్మైన డ్రైవర్ నుఅదుపులోకి తీసుకోవడంతో పాటు వాహనాన్ని గాజువాక ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విజయలక్ష్మి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కిందపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 28, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 38, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె) 8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వె ల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమ దుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	132
లైవ్ ధర	152
విత్ స్కిన్	274
స్కిన్‌లెస్	284

ఉగ్రదాడులపై మాక్‌డ్రిల్

» ఏయూలోని ఐఐపీయూలో నిర్వహించిన నగర పోలీసులు



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఉగ్రదాడులు జరిగితే తిప్పికొట్టడంపై పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి నేతృత్వంలో ఏయూలోని ఐఐపీయూలో తుపాకులతో భవనాలు చుట్టూ కాపు కాశారు. ఉగ్రదాడులు నుంచి సామాన్య ప్రజలను ఏ విధంగా రక్షించాలో డ్రిల్ చేపట్టారు. ముంబైలో జరిగిన ఉగ్రదాడుల సంఘటన ఆధారంగా పోలీసులు ఈ మాక్‌డ్రిల్ నిర్వహించారు.డీఎస్పీలు శ్రీనివాస్, బి.కృష్ణ, త్రీటౌన్ సీఐ పైడయ్య, ఎస్సై సురేష్ కుమార్‌లు పోలీసులకు సూచనలు చేశారు.

కార్పొరేషన్ల డైరెక్టర్లుగా ఇద్దరికి చోటు

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలికవసతుల సంస్థ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా గాజువాకకు చెందిన టీడీపీ సీనియర్ నేత ప్రసాదుల శ్రీనివాస్ నియమితులయ్యారు. అలాగే రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా దక్షిణ నియోజకవర్గ టీడీపీ నాయకుడు గోడి నరసింహాచారిని నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వ స్థలంపై నిర్లక్ష్యమేల?

» సామాజిక భవనం లేక 16వ వార్డులోని రజక వీధి వాసుల ఇబ్బందులు



సచివాలయాలకు కేటాయించిన గతంలోని సామాజిక భవనం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చిన్న చిన్న శుభకార్యాలు.. సంఘానికి సంబంధించిన సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు.. అప్పటి టీడీపీ కార్పొరేటర్, ప్రస్తుత వైసీపీ కార్పొరేటర్ మొల్లి లక్ష్మి నిధులు కలిపి జీవీఎంసీ 16వ వార్డులోని రజక వీధిలో రెండంతస్తుల సామాజిక భవనాన్ని నిర్మించారు. విశాలమైన స్థలం కలిగిన ఈ సామాజిక భవనం గ్రామస్థుల చిన్నపాటి శుభకార్యాలు.. వారి సంఘం సమావేశాలను నిర్వహించుకునేందుకు ఎంతగానో ఉపయోగపడేది. వైసీపీ పాలనలోకి వచ్చాక ప్రజల చేరువకు పాలన అని చెప్పి సామాజిక భవనాన్ని కాస్త సచివాలయాలుగా మార్చారు. దీంతో స్థానికులు సంఘ సమావేశాలు నిర్వహించుకునేందుకు గానీ, చిన్నపాటి శుభకార్యాలు జరిపేందుకు కానీ వీలు కాక సుదూర ప్రాంతాల్లో ఉన్న కల్యాణ మండపాలకు వెళ్లి అధిక మొత్తాన్ని చెల్లించి నిర్వహించుకునే దుస్థితి నెలకొంది. ఇదేమిటని వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే అప్పట్లో కట్టించిన ఇప్పటి కార్పొరేటర్‌ను ప్రశ్నించినా.. అది ప్రభుత్వ నిర్ణయమని సమాధానమిచ్చారు.

ఈ సామాజిక భవనానికి వంద మీటర్ల దూరంలోనే విశాలమైన సుమారు 200 గజాల ప్రభుత్వ స్థలం ఉంది. దీనిని జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడమే కాకుండా ఈ స్థలంలో ఓ ప్రైవేటు వ్యక్తి తన సొంతానికి వాడుకుంటూ వ్యాపారం చేసుకుంటున్నారన్న ఆరోపణలు రావడంతో వెంటనే అధికారులు స్పందించి సదరు వ్యక్తి ఆక్రమణ నుంచి ఆ స్థలాన్ని తప్పించారు. కానీ ఎటువంటి ఉపయోగం లేకుండా అలాగే వదిలేశారు. కనీసం ఈ స్థలం రక్షణ గోడైన, ఫెన్సింగైనా ఏర్పాటు చేయకపోవడం వల్ల అదే ప్రైవేటు వ్యక్తి తన కేటరింగ్ వంట వ్యాపారాన్ని అప్పుడప్పుడు కొనసాగిస్తున్నాడు. ప్రభుత్వ స్థలాలు లేక సామాజిక భవనంలోనూ, అద్దె భవనంలోనూ సచివాలయాలను నడపాల్సిన వస్తుందని చెబుతున్న ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు ఈ స్థలం ఎందుకు కానరావడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలంలో సచివాలయం నిర్మాణం చేపట్టి అటు సామాజిక భవనాన్ని, అద్దె భవనాన్ని ఖాళీ చేస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.



అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలం

స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆరిలోవ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణాపురంలో గల అంబేడ్కర్ గురుకులంలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విశాఖ ఉమ్మడి జిల్లాకు చెందిన అండర్-19 విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. అంబేడ్కర్ గురుకులంప్రిన్సిపాల్ రత్నవల్లి పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. ఆర్చరీ, సైక్లింగ్, సెపిక్ తక్రా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులానికి చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు ప్రవీణ్, పూర్ణ, సిద్దార్థ ఎంపికయ్యారు. అలాగే సెపెక్ తక్రాలో ద్వితీయ ఇంటర్ ఎంపీసీ చదువుచున్న రాజేష్,, సైక్లింగ్‌లో ద్వితీయ ఇంటర్ ఎంపీసీ చదువుచున్న శివ, లోకేష్‌లు ఎంపికైనట్టు పీడీ విద్యాసాగర్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు విశాఖ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వీఏ పుష్పలత తెలిపారు.

జగన్నాథ స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



మండల ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

పెదవాల్తేరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరులోని జగన్నాథ స్వామి దేవాలయం అవరణలో వెలగపూడి రామకృష్ణబాబు శనివారం ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో ప్ర మాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధికారంలోకి వచ్చిన తర్వాత దేవాలయాల్లో భక్తుల సదుపాయాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. నూతన ధర్మకర్తల మండలిలో నియమితులైన వారంతా సేవాభావంతో పని చేసి భక్తులకు సేవలు అందించాలని సూచించారు. ఆలయ నూతన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా బొట్ట రామారావు, సభ్యులుగా పి.రవికిరణ్, ఎ.పైడితల్లి, ఇ.హేమలత,ఎన్.శ్రీని వాసరావు, కె.గౌతమికె.శ్రీనివాసరావు, జి.సత్యనారాయణ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈవో కె.గాయత్రి, టీడీపీ 21వ వార్డు అధ్యక్షు డు పీతల అమరేంద్ర, పీతల అవినాష్, మూర్తి యాదవ్, అర్చకులు పాల్గొన్నారు.

దైవ సమానుడు గురువు : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా



ఉపాధ్యాయరాలికి అవార్డు ప్రదానం చేస్తున్న పల్లా శ్రీనివాసరావు

మద్దిలపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్య అనేది వ్యక్తి జీవితాన్ని మార్చే శక్తి అని, ఆ శక్తిని రూపకల్పన చేసిన గురువు దైవంతో సమానమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏయూ ఇంజనీరింగ్ క్యాంపస్‌లోని వైవీఎస్ ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్-ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బెస్ట్ టీచర్స్ అవార్డ్స్ ప్రదానోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని 179 మంది ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్స్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా 16,347 మంది అభ్యర్థులు ఉద్యోగాలు పొందారన్నారు. నిబద్ధతతో పనిచేస్తున్న ప్రతిభావంతులైన ప్రైవేట్ టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ గురువుల జాబితాలో చేర్చాలనే అపుస్మా విజ్ఞప్తి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అపుస్మా చీఫ్ మెంబర్ యు.కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎంవీ సత్యనారాయణ, కార్యదర్శి సురేష్‌కుమార్, రీజనల్ అధ్యక్షుడు ఎంవీ రావు, శ్రీనివాసరావు, మహమ్మద్ ఖాసిం, కోశాధికారి శేషు తదితరులు పాల్గొన్నారు.

పడి లేచిన కెరటం హెచ్‌పీసీఎల్

భారీ విస్ఫోటం జరిగి నేటికి 28 ఏళ్లు



మల్కాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పడిలేచిన కెరటంలా హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ముందుకు సాగుతోంది. హెచ్‌పీసీఎల్‌లో భారీ విస్ఫోటం సంభవించి ఆదివారం నాటికి 28 ఏళ్లు అవుతుంది. అప్పట్లో ఈ దుర్ఘటనలో 62 మంది మృత్యువాత పడ్డారు. నాడు ఈ ప్రమాదం అందరినీ తీవ్ర విషాదానికి గురిచేసింది. అనంతరం అనేక జాగ్రత్తలు తీసుకుంటూ హెచ్‌పీసీఎల్ అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ.. సంస్థను విస్తరించుకుంటూ.. చమురు శుద్ధిలో అంతర్జాతీయంగా పోటీ పడుతూ ముందుకు సాగుతోంది. విశాఖ సముద్ర తీరాన 1957లో కాల్టెక్స్ పేరుతో ఏర్పడిన ఆయిల్ పరిశ్రమ ఇప్పుడు అంతర్జాతీయంగా ఖ్యాతినార్జించిన హెచ్‌పీసీఎల్‌గా రూపాంతరం చెందింది. 1997 నాటి విస్ఫోటంతో ఇక హెచ్‌పీసీఎల్ పనైపోయిందంటూ అందరూ భావించారు. కానీ పడిలేచిన కెరటంలా హెచ్‌పీసీఎల్ తక్కువ కాలంలోనే మళ్లీ సంస్థలో చమురు శుద్ధి పనులు చేపట్టి అందరినీ సంభ్రమాశ్చార్యాలకు గురి చేసింది. ఇందుకు అధికారులు, కార్మికుల సమష్టి కృషే కారణమని చెప్పవచ్చు.

చరిత్ర సృష్టించిన విశాఖ రిఫైనరీ

క్రూడాయిల్ ఆయిల్ మేనేజ్‌మెంట్‌లో విశాఖ రిఫైనరీ ఆవిష్కరణలకు నాంది పలికి దేశంలోనే తొలిసారిగా క్రూడ్ కేవర్న్ స్టోరేజీ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించింది. భూగర్భంలో చమురు, గ్యాస్ నిల్వలు చేసి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. మార్కెట్ పరిస్థితులను బట్టి అనుకూలంగా ఉన్నప్పుడు క్రూడ్ కొనుగోలు చేయడం, అప్పుడప్పుడు చమురు సరఫరాలో అంతరాయం కలిగినా ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం సేవలందింస్తోంది. ఒకపక్క సంస్థను అభివృద్ధి చేస్తూనే మరోపక్క పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

విస్తరణ దిశగా పరుగులు

ప్రస్తుతం హెచ్‌పీసీఎల్ విస్తరణ దిశగా పరుగులు తీస్తోంది. రూ.30.609 కోట్ల పెట్టుబడితో 8.3గా ఉన్న చమురు శుద్ధి సామర్థ్యాన్ని 15 ఎంఎంటీపీఏకు పెంచింది. ఇందులో భాగంగా ఎంఎంటీపీఏ క్రూడ్ డిస్టిలేషన్ యూనిట్ (సీడీయూ-4)ను విజయవంతంగా నిర్మించి 2023 మార్చిలో ప్రారంభించారు. అదే ఏడాది అక్టోబరులో అతిపెద్ద ఫుల్ కన్వర్షన్ హైడ్రో కాకర్ యూనిట్‌ను ప్రారంభించింది. అంతేకాక ఆసియాలోనే రెండో అతిపెద్ద హైడ్రోజన్ జనరేషన్ యూనిటు, సల్ఫర్ రికవరీ యూనిట్ల సామర్థ్యాన్ని 450 టీపీడీకి పెంచుకుంది. వీటిద్వారా పర్యావరణ నియమాలను పాటిస్తూ శుభ్రమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ ప్రాజెక్టుల్లో మరో ముఖ్యమైనది రిసైడ్యూ అప్‌గ్రేడ్ ఫెసిలిటీ (రఫ్). దీని ద్వారా మరిన్ని లాభాలు సాధించే దిశగా రిఫైనరీ ముందుకు సాగుతోంది.

యూజీడీ పైపులైన్ ఏర్పాటుకు శంకుస్థాపన



ఆదర్శనగర్‌లో యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, పాల్గొన్న కార్పొరేటర్ రామలక్ష్మి, అధికారులు, స్థానిక నేతలు

ఆరిలోవ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో గల ఆదర్శనగర్‌లో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శనివారం శంకుస్థాపన చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ.. కొండవాలు ప్రాంతంలో రూ.36 లక్షల జీవీఎంసీ యూజీడీ కాలువల నిర్మాణం చేస్తోందని తెలిపారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ వార్డులో ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఉంటే వాటికి అంచనాలు రూపొందించి పంపాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్, టీడీపీ 10వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల రాజేష్, బీజేపీ వార్డు అధ్యక్షుడు దొంతల రమణ, స్థానిక నేతలు బుగత తాతారావు, కాళ్ల అప్పలనాయడు,దొంగ నరేష్, ధనలక్ష్మి అంతకేశ్వరరావు, కృష్ణ, సీహెచ్ అప్పలనాయడు, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

శివాజీనగర్‌లో అన్న సమారాధన



అన్న సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు ప్రతాపరుద్ర

ఆరిలోవ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల శివాజీనగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక ఉత్సవాల్లో శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు తనయుడు ప్రతాపరుద్ర విచ్చేసి ప్రారంభించారు. ఆయన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కెల్ల సత్యన్నారాయణ, తెలుగు మహిళ 13వ వార్డు అధ్యక్షురాలు మజ్జి రమణి, పలువురు టీడీపీ నాయకులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

15వ వార్డులో అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవిద్య

వెంకోజీపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులో జీవీఎంసీ నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య శనివారం పరిశీలించారు. వార్డులోని సింహాద్రిపురం కొండవాలు ప్రాంతం సామాజిక భవనం వద్ద నిర్మిస్తున్న రీటైనింగ్ వాల్‌ను కార్పొరేటర్ పరిశీలించి, నాణ్యతలో ఎటువంటి లోపాలు ఉండకూడదని, సకాలంలో పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుగత సత్యనారాయణ, అప్పారి గిరిబాబు, మళ్ల రవికుమార్, బోను సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్షోత్సవాలు



స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సిబ్బంది

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉషోదయ కూడలిలలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్షోత్సవాలను నిర్వహించినట్టు సీనియర్ ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ భారత్ అభియాన్ పథకంలో భాగంగా స్వచ్ఛతా పక్షోత్సవాలను ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకూ నిర్వహిస్తోందని, అందులో భాగంగా ఇగ్నో ఆధ్వర్యంలో నేటి వరకూ ఇగ్నో అధ్యయన కేంద్రాలు, దత్తత గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. శనివారం విశాఖ కార్యాలయంలో అధికారులు, ఇతర సిబ్బందితో కలసి స్వచ్ఛతా ప్రతిజ్ఞ నిర్వహించినట్టు పేర్కొన్నారు. పలు గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు, పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు అక్టోబరు 2 గాంధీ జయంతి సందర్భంగా బహుమతులు, ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు.

'రసాయన మందుల వాడకంలో అప్రమత్తత అవసరం'

రామ్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ళలో ఉండే దోమలు, పురుగులను నిరోదించేందుకు సురక్షితమైన రసాయనిక మందులను మాత్రమే వినియోగించాలని హోం ఇన్‌స్పెక్ట్ కంట్రోల్ అసోసియేషన్ (హీకా) కార్యదర్శి డి.జయంత్ పేర్కొన్నారు. శనివారం పందిమెట్ట వద్ద ఒక సమావేశమందిరంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా సంక్రమించే వ్యాదులు నుంచి రక్షించుకోవటానికి వినియోగించే రసాయనాలపై 'హీకా' ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ళలోని దోమల లేదా ఇతర పురుగులు ద్వారా సంక్రమించే వ్యాదుల నుంచి రక్షించుకోవటానికి ప్రజలు ప్రభుత్వం ఆమోదించి ప్యాకింగ్‌లపై ముద్రించిన సీఐఆర్ రిజిస్ట్రేషన్ నెంబరుతో ఉన్న దోమల నిరోధక రసాయనాల కర్రలను మాత్రమే వినియోగించాలని కోరారు, ఇటీవల విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సేకరించిన అగరబత్తీల రసాయనాలలో ప్రభుత్వం ఆమోదం లేని మెపాఫ్లుతిన్ అనే రసాయనం కలిగి ఉన్నాయని, వాటిని పీల్చటం ద్వారా మనుషులు అనారోగ్యానికి గురవుతారన్నారు, దోమల ద్వారా సంక్రమించే వ్యాధులు ముప్పు నిరంతరం పెరుగుతూ ఉన్నందున నివారణ చాలా కీలకమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వ్యాపారులు, స్థానికులు పాల్గొన్నారు.

కోలాహలంగా గణేష్ నిమజ్జనం



మురళీనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉత్తరంలోని 51వ వార్డు మాధవధార సీతన్నగార్డెన్స్‌లో 18 రోజుల పాటు పూజలందుకున్న భారీ గణనాథుడిని నిమజ్జన ఉత్సవం శనివారం చేపట్టారు. ప్రిన్స్ యూత్ కమిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రుషి వ్యాస గణపతిని మండపం నుంచి భారీ ట్రాలర్‌పై సాంస్కృతిక ప్రదర్శనల మధ్య ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపుగా సాగరతీరానికి తరలించారు. డప్పు చప్పుళ్లు, నృత్య ప్రదర్శనల మధ్య కోలాహలంగా సాగిన నిమజ్జన యాత్రలో భక్తులు వినాయకుని దర్శించుకున్నారు. 23 అడుగుల రుషి వ్యాస గణనాథుడికి జై బోలో గణేష్ మహరాజ్‌కి అంటూ నివాసిత ప్రాంతాల మీదుగా యువత సందడి మధ్య నిమజ్జన కార్యక్రమం ముగిసింది.

'పార్టీ బలోపేతానికి కృషి'



కేక్ కట్ చేస్తున్న సత్యనారాయణ

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ బలోపేతానికి కృషి చేయడం తో పాటు త్వరలో జరగనున్న కార్పొరేటర్ల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి తన వంతు కృషిచేస్తానని నూతనంగా ఎన్నికైన 44వ వార్డు అధ్యక్షుడు గారపాటి సత్యనారాయణ అన్నారు. 80 అడుగుల రోడ్డులోని రామచంద్రనగర్‌లో శనివారం కేక్ కోశారు. అలాగే వార్డు ఇన్‌చార్జ్‌గా మళ్ల లక్ష్మి, కార్యదర్శిగా పందిరిపల్లి శ్రీను నియమితులయ్యారు.

డెక్‌కు బోలెడు డిమాండ్

... 5వ పేజీ తరువాయి

ఒకే ఒక ఫ్లోర్‌ను నక్కపల్లిలో స్టీల్‌ప్లాంటును ఏర్పాటుచేస్తున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ లిమిటెడ్ కంపెనీ తమ కార్యాలయం కోసం ఇవ్వాలని కోరింది. తమకు కావాలని బెంగళూరుకు చెందిన డిజిటల్ సొల్యూషన్స్ ఐటీ కంపెనీ కోవలెన్స్ అమరావతి నుంచి చెప్పించింది. అదేవిధంగా మరో ఫార్మా కంపెనీ కూడా అదే ఫ్లోర్ కావాలని రికమెండేషన్ చేయించుకుంది. ఒకరికి ఇస్తే మిగిలిన ఇద్దరికి మొండి చేయి చూపించినట్టవుతుందని, బహిరంగ వేలం నిర్వహిస్తామని, ఎవరికి కావాలంటే వారు పాడుకోవాలని వీఎంఆర్‌డీఏ తేల్చి చెప్పింది. ఈ నెల 19న ఖరారవుతుంది.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాల అందజేత

సీతమ్మధార, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధార బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో గల బీజేపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్‌లను పలువురికి అందజేశారు.

గ్రేటర్ విశాఖ 26, 43, 45, 53, 54 వార్డులకు చెందిన బాధితులకు మొత్తం రూ.6,34,006 చెక్కులను అనారోగ్య బాధితులు లంకపల్లి ఆనందరావు, భాగ్యలక్ష్మి, సుంకర రాజేశ్వరి, వరలక్ష్మి, కె.రమణ, ఇప్పిలి పూజ, రామారావు, బి.భవానీ, నమ్మి మహేష్‌కుమార్ తదితరులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సునీల్ అగర్వాల్, కార్పొరేటర్లు హనుక్, శ్రావణి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు

13 ఏళ్ళ తర్వాత ఇంటికి చేరిన జార్ఖండ్ వాసి



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా సభ్యులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న మానసిక రోగి అర్జున్‌ను జార్ఖండ్‌లోని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసుతెలిపారు. అర్జున్ గంజాయి సేవించడం వల్ల మతిస్థిమితం కోల్పోయి భార్యాపిల్లలను వదిలేసి ఇంటి నుంచి వెళ్ళిపోవడం, అతడి భార్య కూడా ఎక్కడికో వెళ్ళిపోవడంతో అర్జున్ సోదరి పిల్లలను 13 ఏళ్ళుగా పోషిస్తోందన్నారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో అర్జున్‌ను మే నెలలో పట్టుకొని వసతిగృహంలో ఆశ్రయం కల్పించి శ్రద్ధా ద్వారా చికిత్స అందించినట్టు వాసు తెలిపారు. అతడు మానసిక ఆరోగ్యం కోలుకోవడంతో జార్ఖండ్‌లోని టాటానగర్ దగ్గర కిదాడి గ్రామంలోని ఇద్దరు కుమార్తెలకు, సోదరికి అప్పగించినట్టు ఆయన తెలిపారు.

జోరుగా పేదల పట్టాల రిజిస్ట్రేషన్లు

... 5వ పేజీ తరువాయి

కార్యాలయాల్లో, సీతమ్మధార మండలానికి చెందిన 381 మంది ద్వారకానగర్ కార్యాలయంలో, పెందుర్తి మండలానికి చెందిన 2,969 మంది పెందుర్తి కార్యాలయంలో, గోపాలపట్నం ప్రాంతానికి చెందిన 2,147 మంది గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సూచించారు.

వారి నుంచి ఏ శాఖ సిబ్బంది అయినా లంచాలు ఆశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హెచ్చరించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి ఆరుద్ర

శత జయంతి కార్యక్రమంలో పలువురు ప్రశంస



ఆరుద్రకు నివాళులు అర్పిస్తున్న అతిథులు, నిర్వాహకులు

సీతంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆరుద్ర (భాగవతుల సదాశివ శంకరశాస్త్రి) బహుముఖ ప్రజ్ఞాశాలి అని పలువురు సాహితీవేత్తలు, మేధావులు కొనియాడారు. శనివారం ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో సాహిత్య అకాడమీ, రైటర్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరుద్ర శతజయంతి సదస్సులో పలువురు రచయితలు, మేధావులు పాల్గొన్నారు. సదస్సులో కీలక ఉపన్యాసం చేసిన రచయిత, విమర్శకుడు మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ కల కళ కోసం కాదని ప్రజల కోసమని నమ్మిన వ్యక్తి ప్రజాకవి ఆరుద్ర అన్నారు. 'పుట్టిన రోజు పండుగే అందరికీ, పుట్టింది ఎందుకో తెలిసేది కొందరికే' అని డాక్టర్ సి.నారాయణ రెడ్డి రాశారని, అది అక్షరాల ఆరుద్రకు వర్తిస్తుందన్నారు. కవిత కోసం పుట్టానని, సామాజిక క్రాంతి కోసం కలం పట్టానని ఆరుద్ర అన్నారని, సమాజానికి చరిత్ర పురోగతి ఉంటుందని శ్రీశ్రీ చెప్పారని, అది ఆరుద్ర పాటించారన్నారు. ఆరుద్ర ఇంటి పేరు కులం పేరు వదులుకొని తనను తాను నిరూపించుకున్నారని కొనియాడారు. ఆరుద్ర జమీందారీ కుటుంబం నుంచి వచ్చారని, ఏవీఎన్‌లో ఉన్న పాఠశాలలో చదువుతున్నప్పుడు స్కూల్ మ్యాగజైన్ కోసం తల్లిదండ్రుల కోసం రాసిన కవిత్వం ఆలోచింపజేసిందన్నారు. ఇంట్లో మేనమామ వరసైన మహాకవి శ్రీశ్రీ, కుటుంబం ప్రభావం ఆరుద్రపై ఉందన్నారు. సైన్స్ అభివృద్ధి చెందుతుందని, సమాజానికి అన్వయించాలని భావించి, ఆరుద్ర చెప్పే వారని తెలిపారు. వర్గ సమాజంలో లోహం ప్రవేశించాక, మూడు వర్గాలు శ్రామిక వర్గం, మధ్య తరగతి, ఉన్నత వర్గం వచ్చాయన్నారు. అయితే శ్రామిక వర్గం వైపు ఆరుద్ర నిలబడ్డారని తెలిపారు. తొలి నాళ్ల నుంచి సైంటిఫిక్ దృక్పథాన్ని ఆరుద్ర అలవర్చుకున్నారన్నారు. సమాజం పట్ల నిబద్ధత గల వ్యక్తి ఆరుద్ర అని కొనియాడారు.

సదస్సుకు అధ్యక్షత వహించిన రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో, ముఖ్యంగా ఈ కార్పొరేట్ యుగంలో బయట ప్రపంచం ఎలా ఉంది? ఎలా స్పందించాలనే సామాజిక అవగాహన యువతకు లేకుండా పోయిందన్నారు. ఈ తరుణంలో యువతకు సామాజిక అవగాహన అవసరమని పేర్కొన్నారు. కర్ణాటకలోని పాఠశాల విద్యార్థులకు ఆ ప్రోత్సాహం ఉంటుందని, ఇక్కడ కూడా అలాంటి విద్యావిధానం ఉండాలని సూచించారు. సాహిత్య అకాడమీ కన్వీనర్ సి.మృణాళిని స్వాగతం ఉపన్యాసం చేస్తూ ప్రస్తుతం ఆరుద్ర వంటి కవుల శత జయంతి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా నేటి తరానికి అలాంటి గొప్ప వ్యక్తుల గురించి తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. మహాకవి శ్రీశ్రీ తన గురువు ఆరుద్ర అని చెప్పుకునే వారని గుర్తు చేశారు. కథలు, నాటకాలు, పాటలు, చదరంగం తదితర రంగాల్లో ఆరుద్ర ప్రావీణ్యం సంపాదించారన్నారు. ఆరుద్రను స్మరిస్తూ మంచి కార్యక్రమాన్ని రైటర్స్ అకాడమీతో కలిసి ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. మేడా మస్తాన్ రెడ్డి వాఖ్యాతగా వ్యవహరించిన సదస్సులో గాంధీ సెంటర్ కార్యదర్శి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉప కులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఉస్మానియా యూనివర్శిటీ తెలుగు శాఖ ప్రొఫెసర్ ఎస్.రఘు, రచయితలు తలతోటి పృథ్వీరాజు, అయ్యగారి సీతారత్నం, ఆచార్య బాబీవర్ధన్, అనిల్ డ్యానీ, రాంభట్ల నృసింహశర్మ, బాలసుధాకర్ మౌళి, చింతకింద శ్రీనివాసరావు, బులుసు వెంకటేశ్వర్లు, కేవీఎస్ మూర్తి, అనురాధ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొని ఆరుద్ర జీవిత విశేషాలు, రచనలు, పోరాట పటిమ, తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు సాహితీ అభిమానులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణకు వ్యాకినేషన్

సీతమ్మధార, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ 9 నుంచి 14 ఏళ్ల వయస్సు గల ఆడపిల్లలకు శనివారం గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణ ఉచిత వాక్సినేషన్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు టీకాలు చేయాల్సి ఉండగా, తొలి రోజునే 300 మందికి పైగా ఆడపిల్లలు వ్యాక్సిన్ వేసుకున్నారని తెలిపారు. 670 మంది ఆడపిల్లలు తమ పేర్లను ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్నారని లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ తెలిపారు.

ముగిసిన అప్పన్న ఆభరణాల తనిఖీ

» అర్ధరాత్రి నివేదిక తయారీ! » కమిటీ సభ్యుల సంతకాలు

సింహాచలం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి స్వర్ణ, రజిత ఆభరణాల తనిఖీ ముగిసినట్టు ఫైవ్ మెన్ కమిటీ హెడ్, విజయనగరం జిల్లా దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు. భక్తులు కానుకలుగా అందజేసిన ఆభరణాలలో వ్యత్యాసాలు ఉన్నట్టు కడపకు చెందిన స్వచ్ఛంద సేవా కార్యకర్త కె.ప్రభాకరాచారి తొలుత దేవదాయ శాఖ కమిషనర్‌కు, ఆ తర్వాత విశాఖ జిల్లా కలెక్టర్‌కు, అదే విధంగా దేశ ప్రధానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్..కాకినాడకు చెందిన ఆర్‌జేసి సుబ్బారావును విచారణాధికారిగా నియమించగా ఆయన అదే శాఖకు చెందిన జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజును పంపించారు. ఆయన తన నివేదికను రాష్ట్ర అధికారులకు సమర్పించారు. దానిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండానే మరొకసారి సమగ్ర విచారణకు ఫైవ్ మెన్ కమిటీని దేవదాయ శాఖ కమిషనర్ నియమించారు. ఆ కమిటీ సభ్యులు ఇటీవల ఐదు రోజులపాటు దేవాలయ భాండాగారంలో, సింహాచలంలోని జాతీయ బ్యాంకుల్లో ఉన్న ఆభరణాలను రికార్డుల్లో ఉన్న వివరాలతో సరిపోల్చి చూశారు. అనంతరం శుక్రవారం అర్ధరాత్రి వరకూ నివేదికలు రహస్యంగా తయారుచేసి, దానిపై కమిటీ సభ్యులంతా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కమిటీకి సారథ్యం వహిస్తున్న ప్రసాద్ మాట్లాడుతూ నివేదికను అతి త్వరలోనే దేవదాయ శాఖ కమిషనర్‌కు అందజేస్తామని తెలిపారు. ఆభరణాల లెక్కలన్నీ దాదాపు సరిపోయినట్టేనని చెప్పారు.

డైట్‌కు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

కేటాయించారు. ఇంకా ఆడియో విజువల్ ఎయిడ్స్, డిజిటల్ హార్డ్‌వేర్ అండ్ సాఫ్ట్‌వేర్, ఇంటర్‌నెట్ సౌకర్యం, ప్రత్యేకించి వెబ్‌సైట్ రూపకల్పన, స్మార్ట్ తరగతుల నిర్మాణానికి రూ.1.16 కోట్లు, ప్రహరీ గోడ, సెక్యూరిటీ పోస్టు నిర్మాణం, సీసీ టీవీ, ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్ ఏర్పాటుకు రూ.0.91 కోట్లు, డైట్ అధ్యాపకుల కోసం క్వార్టర్ల నిర్మాణాలకు రూ.1.03 కోట్లు వెచ్చించనున్నారు. అలాగే తాగునీటి సదుపాయం, క్యాంటీన్ భవనం, గార్డెనింగ్, ఫర్నీచర్, వాహనాల పార్కింగ్, సోలార్ ఎక్విప్‌మెంట్, క్రీడలకు సంబంధించి పరికరాలు, నిర్వహణ తదితర అంశాలకు రూ.1.67 కోట్లు కేటాయించారు. నూతన భవనాల నిర్మాణం, ఇతరత్రా వసతుల కల్పనకు టెండర్లు ఆహ్వానించారు. రెండు సంవత్సరాల్లో భవనాలు నిర్మించి వసతులు కల్పించాలని సమగ్ర శిక్షా ఉన్నతాధికారులు నిర్ణయించారు.

కేజీహెచ్‌లో అనధికార బాయ్‌ల దందా

... 5వ పేజీ తరువాయి

ఉంటున్నారు. వారిలో కొందరు మద్యం సేవించి ఉంటారు. అంబులెన్స్ కాని, ఇతర ఏదైనా వాహనంలో రోగిని తీసుకువస్తే వెంటనేవారు అక్కడకు చేరుకొని, అవసరమైన వీల్ ఛైర్, వీల్ బెడ్‌లు సమకూర్చి రోగిని లోపలకు తీసుకు వెళతారు. అక్కడ ఉన్న డ్యూటీ డాక్టర్లకు చూపించినట్టు నటించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఎవరైనా డబ్బులు ఇవ్వకుంటే దాడి పాల్పడుతున్నారు. చాలా ఏళ్లుగాఈ దందా కొనసాగుతోంది. రోగులు, వారి బంధువులపై దాడులకు పాల్పడిన సంఘటనలు కోకొల్లలు. ఈ విషయం ఆస్పత్రిలోని ఉన్నతాధికారులకు తెలిసినా ఎటువంటి చర్యలూ తీసుకోరు. కాగా క్యాజువాలిటీలో పోలీసు అవుట్ పోస్టు ఉన్నా..ఈ దందా గురించి పట్టించుకోకపోవడం గమనార్హం. అనధికార వార్డు బాయ్ దాడి గురించి ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంఓ సీహెచ్ శ్రీహరి వద్ద ప్రస్తావించగా బాధితుడు ఈశ్వరరావు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. అనధికార వ్యక్తులను ఆస్పత్రి నుంచి బయటకు పంపించేశామని, సోమవారం నుంచి మరిన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

స్థానికులకు ఉక్కు మొండిచెయ్యి

... 5వ పేజీ తరువాయి

విభాగంలోనైనా పనిచేసుకోవచ్చు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ఇప్పుడు ఈ సేఫ్టీ పాస్‌లు ఇస్తున్నారు. అంటే తొలగించిన 4,500 కాంట్రాక్ట్ వర్కర్లలో ఎవరికీ పనిచేసే అవకాశం ఇవ్వకుండా పొరుగు రాష్ట్రాల వారిని తెప్పించి పనిచేయిస్తున్నారు. దీనిపై కాంట్రాక్ట్ వర్కర్ల సంఘం శనివారం ఆందోళనకు దిగింది. శిక్షణ కార్యాలయం ముందు నిరసన వ్యక్తంచేసింది. స్టీల్ ప్లాంటుకు భూములు ఇచ్చిన నిర్వాసితులకు, ఆ తరువాత ఇక్కడి స్థానికులకు ప్లాంటులో పనిచేసే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత నాలుగు దశాబ్దాలుగా ఆ నిబంధన అమలవుతున్నదని, ఇప్పుడు దానిని పక్కన పెట్టి పొరుగు రాష్ట్రాల వారితో పనిచేయిస్తున్నందున తాము ఆందోళనలు ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. మే నెలలో తొలగించిన కాంట్రాక్టు వర్కర్లలో 300 మంది నిర్వాసితులు ఉన్నారని, వారిని వీలైనంత త్వరగా మళ్లీ తీసుకుంటామని ఇటీవల జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కు సీఎండీ సక్సేనా హామీ ఇచ్చారని, దానిని తుంగలో తొక్కారని, స్థానికులకు అన్యాయం చేస్తున్నారని సంఘ నాయకులు ఆరోపించారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులకు పనులు ఇవ్వాలని, లేదంటే నిరవధికంగా ఆందోళనలు కొనసాగిస్తామని నాయకులు ప్రసాద్, పరంధామయ్య, వంశీకృష్ణ ప్రకటించారు.

19న డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుకు విద్యా శాఖ సన్నాహాలు చేస్తోంది. ఉత్తరాంధ్రలో 2,660 మందికి నియామక పత్రాలు అందజేస్తారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ, గురుకులాలు/మోడల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, టీజీటీ, పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు తోడుగా కుటుంబ సభ్యుల్లో ఒకరిని అభినందన సభకు అనుమతిస్తారు. ఉత్తరాంధ్ర నుంచి అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను తీసుకువెళ్లడానికి సుమారు 120 బస్సులు ఏర్పాటుచేస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి ఈనెల 18వ తేదీ ఉదయం బస్సులు బయలుదేరతాయి. ఆరోజు రాత్రికి విజయవాడ సమీపంలో వారికి వసతి ఏర్పాటుచేస్తారు. 19వ తేదీ ఉదయం అభినందన సభలో జిల్లాల నుంచి ఎంపిక చేసిన కొద్దిమందికి సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఇతర ప్రముఖులు నియామక పత్రాలు అందజేస్తారు. మిగిలిన వారికి అదే ప్రాంగణంలో ఏర్పాటుచేసే కౌంటర్ల ద్వారా పత్రాలు ఇవ్వనున్నారు. అభినందన సభ ముగిసిన తరువాత తిరిగి అవే బస్సుల్లో జిల్లాలకు తీసుకువస్తారు. ఆ తరువాత ఎంపికైన అభ్యర్థులకు పాఠశాలల నిర్వహణ, బోధన, పరిపాలన, ఇతర అంశాలపై జిల్లాల వారీగా పది రోజులపాటు శిక్షణ ఇస్తారు. ఇప్పటివరకూ డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లను కౌన్సెలింగ్‌లోనే పాఠశాలలు కేటాయించేసేవారు. ఈ పర్యాయం పది రోజుల శిక్షణ ఇచ్చిన తరువాత పాఠశాలలకు పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఉద్యోగికి శిక్షణ అవసరమని విద్యా శాఖ అధికారి ఒకరు తెలిపారు. దసరా సెలవులు తరువాత కొత్త టీచర్లకు పాఠశాలలు కేటాయించనున్నట్టు పేర్కొన్నారు.

పార్కుకు ఎసరు!

... 5వ పేజీ తరువాయి

కేటాయించిన భూమి తమదని, ఆ భూమిని తమ కుటుంబ పెద్దలు విక్రయించలేదంటూ నకిలీ పత్రాలను తయారుచేశారు. పార్కులో చిన్నపాటి షెడ్ వేసి తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు యత్నించారు. ఈ విషయం కొందరు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా...వారు పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేశారు. పార్కులోని ఆక్రమణలను తొలగించి చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ వేశారు. అయితే ఇప్పుడు రుషికొండ ప్రాంతంలో భూములు, స్థలాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఆ ప్రాంతంలో చదరపు గజం ధర రూ.80 వేలు వరకు పలుకుతోంది. దీనినిబట్టి 2,400 గజాల స్థలం విలువ దాదాపు రూ.20 కోట్లు ఉంటుంది. అంతటి ఖరీదైన పార్కు స్థలాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవాలనే నిశ్చయంతో వైసీపీ చోటానేత తిరిగి తన ప్రయత్నాలను ప్రారంభించారు. గతంలో లేఅవుట్‌కు భూములు విక్రయించిన వారి వారసుల పేరుతో కొందరిని కూడగట్టారు. పార్కు స్థలం తమది అంటూ సృష్టించిన నకిలీపత్రాలను చూపించి ఆ స్థలం విక్రయించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ స్థలంలోకి ఇతరులెవరూ అడుగుపెట్టకుండా కొందరు రౌడీలను ఏర్పాటుచేశారు. ఆ భూమికి ఎలాంటి తగాదాలు లేవని చెప్పి ఇటీవల ఒకరికి విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగా రూ.కోటి అడ్వాన్సుగా వైసీపీ చోటా నేత అందుకున్నట్టు స్థానికులు పేర్కొంటున్నారు. జీవీఎంసీ అధికారులకు దీనిపై సమాచారం ఇచ్చినా స్పందించలేదని ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ జోన్-2 అధికారులు స్పందించి కబ్జారాయుళ్లకు ముకుతాడు వేయకపోతే పార్కు స్థలం అన్యాక్రాంతం అయిపోవడం ఖాయమని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



పలు కేసుల్లో బాధితులకు చెక్కు అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం

మహారాణిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : లోక్ అదాలత్‌లతో కక్షిదారులకు సత్వరమే న్యాయం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షుడు చిన్నంశెట్టి రాజా అన్నారు, శనివారం జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 36 లోక్ అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేసి 124 మోటర్ వాహన ప్రమాద కేసులను పరిష్కరించారు. అలాగే 185 సివిల్ కేసులు, 10,190 క్రిమినల్ కేసులు, 239 ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ చేసి, నష్టపరిహారంగా రూ. 25 కోట్ల చెల్లింపులు చేపట్టారు. ఈ కేసులను పరిష్కరించడం ద్వారా రాష్ట్రంలో విశాఖ జిల్లా 4వ స్థానంలో నిలిచినట్టు జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

కనకమ్మకు లక్ష తులసీ దళార్చన



మహారాణిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లో ఉన్న కనక మహాలక్ష్మి అమ్మవారికి శనివారం లక్ష తులసీ దళార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో అమ్మవారిని మేల్కొలిపి ప్రభారాధ నలు పూర్తి చేశారు. అనంతరం అర్చ కులు, వేద పండితుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం జరిపి,లక్ష తులసీ దళార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 81 మందికి రూ. 8 లక్షల జరిమానా

ఆనందపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన 81 మందికి భీమిలి కోర్టు రూ.10 వేలు చొప్పున మొత్తం రూ. 8.10 లక్షల జరిమానా విధించింది. ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 81 మందిపై కేసులు నమోదు చేశారు.వారిని శనివారం భీమిలిలో 2వ అదనపు జూనియరు సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ పి. స్వాతిభవానీ ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున అపరాధ రుసుం విధించారు.

స్పా ముసుగులో వ్యభిచారం

... 5వ పేజీ తరువాయి

నిర్వహిస్తున్నారు. మసాజ్ చేయడానికి అని చెప్పి ఉద్యోగంలోకి తీసుకున్న మహిళలను బలవంతంగా అందుకు ఉపయోగిస్తున్నారు. దీనిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో శనివారం గాజువాక పోలీసులతో కలిసి దాడి చేశారు. నిర్వాహకురాలితోపాటు విటుడిని అరెస్టు చేశారు. మహిళలను పునరావాస కేంద్రానికి అప్పగించారు.



మార్కెట్‌లో మూసి ఉన్న దుకాణాలు



అనుపోత్సవంలో పాల్గొన్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, తదితరులు

ఘనంగా గణేశ్ విగ్రహం అనుపోత్సవం

» పదేళ్ల తరువాత పూర్ణా మార్కెట్‌కు సెలవు

» స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసిన వ్యాపారులు

మహారాణిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పూర్ణామార్కెట్‌లో వినాయక ఉత్సవాల్లో భాగంగా శనివారం అనుపోత్సవం నిర్వహించారు. పదేళ్ల తరువాత వ్యాపారులు మార్కెట్‌కు సెలవు ప్రకటించి దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు.ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న ఈ మార్కెట్‌కు ఇప్పటివరకూ సెలవు ప్రకటించలేదు. ఎలాంటి ఉప ద్రవం వచ్చినా.. బంద్‌లు, తుఫాన్లు వచ్చినా మార్కెట్‌ను తెరిచేవారు. ఏటా ఇక్కడ వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. ముఖ్యంగా అనుపోత్సవాన్ని వ్యాపారులు కలిసికట్టుగా జరుపుతారు. ఈమేరకు సర్దార్ వల్లాబాయ్ పటేల్ వర్తక సంఘం అధ్యక్షుడు దాడి రామకృష్ణ ఆధ్వర్యంలో గణేశ్ ప్రతిమ అనుపోత్సవాన్ని వైభవంగా జరిపారు. మార్కెట్‌లో అన్ని దుకాణాలను వ్యాపారులు స్వచ్ఛందగా మూసి వేసి, వేడుకల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు ఐదు వేల మంది స్వామివారి ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య గణేశ్ ప్రతిమను వైభవంగా ఊరేగించారు.

'చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి'

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : లిక్కర్ స్కామ్‌లో జగన్ సంపాదించిన డబ్బుతో మెడికల్ కాలేజీల నిర్మాణాలను పూర్తి చేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు, విద్యార్థుల భవిత కోసం మంత్రి నారా లోకేశ్ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. కేంద్రం విడుదల చేసిన మెడికల్ కాలేజీల నిధులను నేబాగ్ రుణాల ద్వారా మాజీ సీఎం జగన్ రుషికొండ కట్టడాలకు, విందు, వినోదాలకు ఖర్చుపెట్టి వృథా చేశారని ఆరోపించారు. ఇప్పుడు సీఎం చంద్రబాబునాయుడు మెడికల్ కాలేజీలను అమ్మేస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నాటి వైసీపీ ప్రభుత్వమే కారణమని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కువ మంది రైతులు జగన్ సర్కాల్‌లోనే ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ లేనిపోని ఆరోపణలు చేస్తుందని విమర్శించారు. సమావేశంలో ఆయనతో పాటు జుంజురు గోవింద్, వాసుపల్లి రాంబాబు, జింజూరు శివ ఉన్నారు.

కొండమేకపై కుక్కల దాడి



గాయాలతో అపార్టుమెంట్ సెల్లార్‌లో దాక్కున్న కొండ మేక

కొమ్మాది, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కంబాల కొండ అటవీ ప్రాంతం నుంచి శనివారం సాయంత్రం శంభువానిపాలెం చెక్ పోస్టు ద్వారా ఓ కొండమేక జనావాసాల్లోకి వచ్చింది. దాన్ని చూసి కుక్కలు అరవడంతో భయపడి షిప్‌యార్డు కాలనీ వైపు పరుగులు తీసింది. అటువైపు నుంచి కూడా కుక్కలు వెంట పడి దాడి చేయడంతో గాయాలతో సమీపంలోని ఎంవీవీ ప్లాజా అపార్టుమెంట్ సెల్లార్‌లోకి ప్రవేశించింది. కొండ మేకను చూసిన అపార్టుమెంట్ నివాసి సీతారామ్మూర్తి గేటు వేసి, కుక్కలు లోపలికి రాకుండా అడ్డుకోవడంతో పాటు మేకకు మంచినీరు, ఆహారం అందించారు. ఈ విషయాన్ని ఆయన సామాజిక మాధ్యమంలో పోస్టు చేయడంతో అటవీ శాఖాధికారులకు సమాచారం తెలిసింది. ఈమేరకు రేంజ్ అధికారి శాస్త్రి, బీట్ గార్డు ఎల్లారావు, జూ వైద్యుడు భాను ప్రతాప్ అక్కడికి చేరుకున్నారు. అత్యవసర చికిత్స అనంతరం కొండమేకను ప్రత్యేక వాహనంలో జూపార్కుకు తరలించారు.

రాడిసన్ బ్లూలో వసుంధర డైమండ్స్ మెగా ఎగ్జిబిషన్ ప్రారంభం



గిరిజన విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు ఇస్తున్న సంస్థ సభ్యులు

సాగర్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో వసుంధర డైమండ్స్ మెగా ఎగ్జిబిషన్ శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా వసుంధర డైమండ్ రూఫ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. వసుంధర మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ జరుతుందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలంలోని తుమ్మలోవ గిరిజన గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు పిల్లలకు చదువు, ఉచిత వైద్య శిబిరాలు వంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ తొట్టెంపూడి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ నేవీ ఉద్యోగి మృతి

ఈ నెల 10న విధులు నిర్వహిస్తుండగా క్వార్టర్స్ ఆర్చ్ పెచ్చులు పడి గాయాలు

మద్దిలపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈస్ట్‌పాయింట్ కాలనీలోని నేవీ క్వార్టర్స్ ఆర్చ్ శ్లాబు పడి గాయాలైపాలైన నేవీ ఉద్యోగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. నేవల్ అధికారి ఫిర్యాదు మేరకు శనివారం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఢిల్లీ నేవీ జవాన్‌గా పని చేస్తున్న చంద్రమోహన్‌ది ఉత్తరాఖండ్. అతడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. చంద్రమోహన్ ఢిల్లీ నుంచి ఈనెల 6న బదిలీపై నగారానికి వచ్చి విధుల్లో చేరాడు. 10న ఈస్ట్ పాయింట్ కాలనీ నేవల్ క్వార్టర్స్ వద్ద రాత్రి సెంట్రీ విధులు నిర్వహిస్తుండగా, రాత్రి 10.30 గంటల సమయం లో క్వార్టర్స్ ఆర్చ్ శ్లాబు అతడిపై విరిగిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న మరో జవాన్, క్వార్టర్స్ నివాసులు వెంటనే అతడిని కల్యాణి ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చంద్రమోహన్ శుక్రవారం మృతి చెందాడు. దీనిపై శనివారం నేవల్ అధికారులు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : లాసన్స్‌బే కాలనీ వద్ద ఈ నెల 4వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందారు. ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇసుకతోట రామాలయం ప్రాంతానికి చెందిన అలుపన శ్యామ్‌సుందర్ (36) ఈ నెల 4న తెల్లవారు జామున స్కూటీపై వెళుతూ డివైడర్‌ను ఢీకొట్టి పడిపోయారు. అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో అతడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

గాజువాక, సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): ఇక్కడి జగ్గు జంక్షన్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పి.విజయలక్ష్మి (60) అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. చినగంట్యాడ ప్రాంతానికి చెందిన చింతకాయల వాణి స్కూటీపై తన తల్లి విజయలక్ష్మి, కుమార్తె తమన్వితో కలిసి సుందరయ్యకాలనీ వైపు వెళ్తుంది.ఈ క్రమంలో జగ్గు జంక్షన్ దాటాక పెద్ద గొయ్యిని తప్పించేందుకు గాను స్కూటీని కుడివైపు మళ్లిస్తుండగా వెనుకే వస్తున్న భారీ వాహనం ఢీకొంది. దీంతో విజయలక్ష్మి రోడ్డు మధ్యలో పడిపోగా, ఆమె పై నుంచి వాహనం వెళ్లడంతో మృతి చెందింది. వాణి, తమన్విలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోవడంతో పాటు వాహనాన్ని గాజువాక ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విజయలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 28, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 38, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె) 8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	132
లైవ్ ధర	152
విత్ స్కిన్	274
స్కిన్‌లెస్	284

ఉగ్రదాడులపై మాక్‌డ్రిల్

ఏయూలోని ఐఐపీయూలో నిర్వహించిన నగర పోలీసులు


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఉగ్రదాడులు జరిగితే తిప్పికొట్టడంపై పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి నేతృత్వంలో ఏయూలోని ఐఐపీయూలో తుపాకులతో భవనాలు చుట్టూ కాపు కాశారు. ఉగ్రదాడులు నుంచి సామాన్య ప్రజలను ఏ విధంగా రక్షించాలో డ్రిల్ చేపట్టారు. ముంబైలో జరిగిన ఉగ్రదాడుల సంఘటన ఆధారంగా పోలీసులు ఈ మాక్‌డ్రిల్ నిర్వహించారు.డీఎస్పీలు శ్రీనివాస్, బి.కృష్ణ, త్రీటౌన్ సీఐ పైడయ్య, ఎస్సై సురేష్ కుమార్‌లు పోలీసులకు సూచనలు చేశారు.

కార్పొరేషన్ల డైరెక్టర్లగా ఇద్దరికి చోటు

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలికవసతుల సంస్థ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా గాజువాకకు చెందిన టీడీపీ సీనియర్ నేత ప్రసాదుల శ్రీనివాస్ నియమితులయ్యారు. అలాగే రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా దక్షిణ నియోజకవర్గ టీడీపీ నాయకుడు గోడి నరసింహాచారిని నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వ స్థలంపై నిర్లక్ష్యమేల?

సామాజిక భవనం లేక 16వ వార్డులోని రజక వీధి వాసుల ఇబ్బందులు


సచివాలయాలకు కేటాయించిన గతంలోని సామాజిక భవనం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చిన్న చిన్న శుభకార్యాలు.. సంఘానికి సంబంధించిన సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు.. అప్పటి టీడీపీ కార్పొరేటర్, ప్రస్తుత వైసీపీ కార్పొరేటర్ మొల్లి లక్ష్మి నిధులు కలిపి జీవీఎంసీ 16వ వార్డులోని రజక వీధిలో రెండంతస్తుల సామాజిక భవనాన్ని నిర్మించారు. విశాలమైన స్థలం కలిగిన ఈ సామాజిక భవనం గ్రామస్థుల చిన్నపాటి శుభకార్యాలు.. వారి సంఘం సమావేశాలను నిర్వహించుకునేందుకు ఎంతగానో ఉపయోగపడేది. వైసీపీ పాలనలోకి వచ్చాక ప్రజల చేరువకు పాలన అని చెప్పి సామాజిక భవనాన్ని కాస్త సచివాలయాలుగా మార్చారు. దీంతో స్థానికులు సంఘ సమావేశాలు నిర్వహించుకునేందుకు గానీ, చిన్నపాటి శుభకార్యాలు జరిపేందుకు కానీ వీలు కాక సుదూర ప్రాంతాల్లో ఉన్న కల్యాణ మండపాలకు వెళ్లి అధిక మొత్తాన్ని చెల్లించి నిర్వహించుకునే దుస్థితి నెలకొంది. ఇదేమిటని వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే అప్పట్లో కట్టించిన ఇప్పటి కార్పొరేటర్‌ను ప్రశ్నించినా.. అది ప్రభుత్వ నిర్ణయమని సమాధానమిచ్చారు.

ఈ సామాజిక భవనానికి వంద మీటర్ల దూరంలోనే విశాలమైన సుమారు 200 గజాల ప్రభుత్వ స్థలం ఉంది. దీనిని జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడమే కాకుండా ఈ స్థలంలో ఓ ప్రైవేటు వ్యక్తి తన సొంతానికి వాడుకుంటూ వ్యాపారం చేసుకుంటున్నారన్న ఆరోపణలు రావడంతో వెంటనే అధికారులు స్పందించి సదరు వ్యక్తి ఆక్రమణ నుంచి ఆ స్థలాన్ని తప్పించారు. కానీ ఎటువంటి ఉపయోగం లేకుండా అలాగే వదిలేశారు. కనీసం ఈ స్థలం రక్షణ గోడైన, ఫెన్సింగైనా ఏర్పాటు చేయకపోవడం వల్ల అదే ప్రైవేటు వ్యక్తి తన కేటరింగ్ వంట వ్యాపారాన్ని అప్పుడప్పుడు కొనసాగిస్తున్నాడు. ప్రభుత్వ స్థలాలు లేక సామాజిక భవనంలోనూ, అద్దె భవనంలోనూ సచివాలయాలను నడపాల్సిన వస్తుందని చెబుతున్న ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు ఈ స్థలం ఎందుకు కానరావడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలంలో సచివాలయం నిర్మాణం చేపట్టి అటు సామాజిక భవనాన్ని, అద్దె భవనాన్ని ఖాళీ చేస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.


అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలం

స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అరిలోవ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణాపురంలో గల అంబేడ్కర్ గురుకులంలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వరంలో విశాఖ ఉమ్మడి జిల్లాకు చెందిన అండర్-19 విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. అంబేడ్కర్ గురుకులంప్రిన్సిపాల్ రత్నవల్లి పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. ఆర్చరీ, సైక్లింగ్, సెపిక్ తక్రా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులానికి చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు ప్రవీణ్, పూర్ణ, సిద్ధార్థ ఎంపికయ్యారు. అలాగే సెపెక్ తక్రాలో ద్వితీయ ఇంటర్ ఎంపీసీ చదువుచున్న రాజేష్,, సైక్లింగ్‌లో ద్వితీయ ఇంటర్ ఎంపీసీ చదువుచున్న శివ, లోకేష్‌లు ఎంపికైనట్టు పీడీ విద్యాసాగర్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు విశాఖ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వీఏ పుష్పలత తెలిపారు.

జగన్నాథ స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం


మండల ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

పెదవాల్తేరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరులోని జగన్నాథ స్వామి దేవాలయం అవరణలో వెలగపూడి రామకృష్ణబాబు శనివారం ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో ప్ర మాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధికారంలోకి వచ్చిన తర్వాత దేవాలయాల్లో భక్తుల సదుపాయాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. నూతన ధర్మకర్తల మండలిలో నియమితులైన వారంతా సేవాభావంతో పని చేసి భక్తులకు సేవలు అందించాలని సూచించారు. ఆలయ నూతన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా బొట్ట రామారావు, సభ్యులుగా పి.రవికిరణ్, ఎ.పైడితల్లి, ఇ.హేమలత,ఎన్.శ్రీనివాసరావు, కె.గౌతమి,కె.శ్రీనివాసరావు, జి.సత్యనారాయణ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈవో కె.గాయత్రి, టీడీపీ 21వ వార్డు అధ్యక్షుడు పీతల అమరేంద్ర, పీతల అవినాష్, మూర్తి యాదవ్, అర్చకులు పాల్గొన్నారు.

దైవ సమానుడు గురువు : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా



ఉపాధ్యాయురాలికి అవార్డు ప్రదానం చేస్తున్న పల్లా శ్రీనివాసరావు

మద్దిలపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్య అనేది వ్యక్తి జీవితాన్ని మార్చే శక్తి అని, ఆ శక్తిని రూపకల్పన చేసిన గురువు దైవంతో సమానమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏయూ ఇంజనీరింగ్ క్యాంపస్‌లోని వైవీఎస్ ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్-ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బెస్ట్ టీచర్స్ అవార్డ్స్ ప్రదానోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని 179 మంది ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్స్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా 16,347 మంది అభ్యర్థులు ఉద్యోగాలు పొందారన్నారు. నిబద్ధతతో పనిచేస్తున్న ప్రతిభావంతులైన ప్రైవేట్ టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ గురువుల జాబితాలో చేర్చాలనే అపుస్మా విజ్ఞప్తి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అపుస్మా చీఫ్ మెంబర్ యు.కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, కార్యదర్శి సురేష్‌కుమార్, రీజనల్ అధ్యక్షుడు ఎంవీ రావు, శ్రీనివాసరావు, మహమ్మద్ ఖాసిం, కోశాధికారి శేషు తదితరులు పాల్గొన్నారు.

పడి లేచిన కెరటం హెచ్‌పీసీఎల్

భారీ విస్ఫోటం జరిగి నేటికి 28 ఏళ్లు



మల్కాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పడిలేచిన కెరటంలా హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ముందుకు సాగుతోంది. హెచ్‌పీసీఎల్‌లో భారీ విస్ఫోటం సంభవించి ఆదివారం నాటికి 28 ఏళ్లు అవుతుంది. అప్పట్లో ఈ దుర్ఘటనలో 62 మంది మృత్యువాత పడ్డారు. నాడు ఈ ప్రమాదం అందరినీ తీవ్ర విషాదానికి గురిచేసింది. అనంతరం అనేక జాగ్రత్తలు తీసుకుంటూ హెచ్‌పీసీఎల్ అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ.. సంస్థను విస్తరించుకుంటూ.. చమురు శుద్ధిలో అంతర్జాతీయంగా పోటీ పడుతూ ముందుకు సాగుతోంది. విశాఖ సముద్ర తీరాన 1957లో కాల్టాక్స్ పేరుతో ఏర్పడిన ఆయిల్ పరిశ్రమ ఇప్పుడు అంతర్జాతీయంగా ఖ్యాతినార్జించిన హెచ్‌పీసీఎల్‌గా రూపాంతరం చెందింది. 1997 నాటి విస్ఫోటంతో ఇక హెచ్‌పీసీఎల్ పనైపోయిందంటూ అందరూ భావించారు. కానీ పడిలేచిన కెరటంలా హెచ్‌పీసీఎల్ తక్కువ కాలంలోనే మళ్లీ సంస్థలో చమురు శుద్ధి పనులు చేపట్టి అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. ఇందుకు అధికారులు, కార్మికుల సమష్టి కృషే కారణమని చెప్పవచ్చు.

చరిత్ర సృష్టించిన విశాఖ రిఫైనరీ

క్రూడాయిల్ ఆయిల్ మేనేజ్‌మెంట్‌లో విశాఖ రిఫైనరీ ఆవిష్కరణలకు నాంది పలికి దేశంలోనే తొలిసారిగా క్రూడ్ కేవర్న్ స్టోరేజీ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించింది. భూగర్భంలో చమురు, గ్యాస్ నిల్వలు చేసి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. మార్కెట్ పరిస్థితులను బట్టి అనుకూలంగా ఉన్నప్పుడు క్రూడ్ కొనుగోలు చేయడం, అప్పుడప్పుడు చమురు సరఫరాలో అంతరాయం కలిగినా ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం సేవలందిస్తోంది. ఒకపక్క సంస్థను అభివృద్ధి చేస్తూనే మరోపక్క పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

విస్తరణ దిశగా పరుగులు

ప్రస్తుతం హెచ్‌పీసీఎల్ విస్తరణ దిశగా పరుగులు తీస్తోంది. రూ.30.609 కోట్ల పెట్టుబడితో 8.3గా ఉన్న చమురు శుద్ధి సామర్థ్యాన్ని 15 ఎంఎంటీపీఏకు పెంచింది. ఇందులో భాగంగా ఎంఎంటీపీఏ క్రూడ్ డిస్టిలేషన్ యూనిట్ (సీడీయూ-4)ను విజయవంతంగా నిర్మించి 2023 మార్చిలో ప్రారంభించారు. అదే ఏడాది అక్టోబరులో అతిపెద్ద ఫుల్ కన్వర్షన్ హైడ్రో కాకర్ యూనిట్‌ను ప్రారంభించింది. అంతేకాక ఆసియాలోనే రెండో అతిపెద్ద హైడ్రోజన్ జనరేషన్ యూనిటు, సల్ఫర్ రికవరీ యూనిట్ల సామర్థ్యాన్ని 450 టీపీడీకి పెంచుకుంది. వీటిద్వారా పర్యావరణ నియమాలను పాటిస్తూ శుభ్రమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ ప్రాజెక్టుల్లో మరో ముఖ్యమైనది రిసైడ్యూ అప్‌గ్రేడ్ ఫెసిలిటీ (రఫ్). దీని ద్వారా మరిన్ని లాభాలు సాధించే దిశగా రిఫైనరీ ముందుకు సాగుతోంది.

యూజీడీ పైపులైన్ ఏర్పాటుకు శంకుస్థాపన



ఆదర్శనగర్‌లో యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, పాల్గొన్న కార్పొరేటర్ రామలక్ష్మి, అధికారులు, స్థానిక నేతలు

అరిలోవ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో గల ఆదర్శనగర్‌లో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శనివారం శంకుస్థాపన చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ.. కొండవాలు ప్రాంతంలో రూ.36 లక్షల జీవీఎంసీ యూజీడీ కాలువల నిర్మాణం చేస్తోందని తెలిపారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ వార్డులో ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఉంటే వాటికి అంచనాలు రూపొందించి పంపాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్, టీడీపీ 10వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల రాజేష్, బీజేపీ వార్డు అధ్యక్షుడు దొంతల రమణ, స్థానిక నేతలు బుగత తాతారావు, కాళ్ల అప్పలనాయుడు,దొంగ నరేష్, ధనలక్ష్మి అంతకేశ్వరరావు, కృష్ణ, సీహెచ్ అప్పలనాయుడు, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

శివాజీనగర్‌లో అన్న సమారాధన


అన్న సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు ప్రతాపరుద్ర

అరిలోవ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల శివాజీనగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక ఉత్సవాల్లో శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు తనయుడు ప్రతాపరుద్ర విచ్చేసి ప్రారంభించారు. ఆయన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కెల్ల సత్యన్నారాయణ, తెలుగు మహిళ 13వ వార్డు అధ్యక్షురాలు మజ్జి రమణి, పలువురు టీడీపీ నాయకులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

15వ వార్డులో అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్


ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవిద్య

వెంకోజీపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులో జీవీఎంసీ నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య శనివారం పరిశీలించారు. వార్డులోని సింహాద్రిపురం కొండవాలు ప్రాంతం సామాజిక భవనం వద్ద నిర్మిస్తున్న రీటైనింగ్ వాల్‌ను కార్పొరేటర్ పరిశీలించి, నాణ్యతలో ఎటువంటి లోపాలు ఉండకూడదని, సకాలంలో పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుగత సత్యనారాయణ, అప్పారి గిరిబాబు, మళ్ల రవికుమార్, బోను సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్షోత్సవాలు



స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సిబ్బంది

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉషోదయ కూడలిలలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్షోత్సవాలను నిర్వహించినట్టు సీనియర్ ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ భారత్ అభియాన్ పథకంలో భాగంగా స్వచ్ఛతా పక్షోత్సవాలను ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకూ నిర్వహిస్తోందని, అందులో భాగంగా ఇగ్నో ఆధ్వర్యంలో నేటి వరకూ ఇగ్నో అధ్యయన కేంద్రాలు, దత్తత గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. శనివారం విశాఖ కార్యాలయంలో అధికారులు, ఇతర సిబ్బందితో కలసి స్వచ్ఛతా ప్రతిజ్ఞ నిర్వహించినట్టు పేర్కొన్నారు. పలు గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు, పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు అక్టోబరు 2 గాంధీ జయంతి సందర్భంగా బహుమతులు, ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు.

'రసాయన మందుల వాడకంలో అప్రమత్తత అవసరం'

రామ్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లలో ఉండే దోమలు, పురుగులను నిరోధించేందుకు సురక్షితమైన రసాయనిక మందులను మాత్రమే వినియోగించాలని హోం ఇన్‌స్పెక్ట్ కంట్రోల్ అసోసియేషన్ (హీకా) కార్యదర్శి డి.జయంత్ పేర్కొన్నారు. శనివారం పందిమెట్ట వద్ద ఒక సమావేశమందిరంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా సంక్రమించే వ్యాధులు నుంచి రక్షించుకోవటానికి వినియోగించే రసాయనాలపై 'హీకా' ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలోని దోమల లేదా ఇతర పురుగులు ద్వారా సంక్రమించే వ్యాధుల నుంచి రక్షించుకోవటానికి ప్రజలు ప్రభుత్వం ఆమోదించి ప్యాకింగ్‌లపై ముద్రించిన సీఐఆర్ రిజిస్ట్రేషన్ నెంబరుతో ఉన్న దోమల నిరోధక రసాయనాల కర్రలను మాత్రమే వినియోగించాలని కోరారు. ఇటీవల విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సేకరించిన అగరబత్తీల రసాయనాలలో ప్రభుత్వం ఆమోదం లేని మెపాఫ్లుతిన్ అనే రసాయనం కలిగి ఉన్నాయని, వాటిని పీల్చటం ద్వారా మనుషులు అనారోగ్యానికి గురవుతారన్నారు, దోమల ద్వారా సంక్రమించే వ్యాధులు ముప్పు నిరంతరం పెరుగుతూ ఉన్నందున నివారణ చాలా కీలకమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వ్యాపారులు, స్థానికులు పాల్గొన్నారు.

కోలాహలంగా గణేష్ నిమజ్జనం



మురళీనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉత్తరంలోని 51వ వార్డు మాధవధార సీతన్నగార్డెన్స్‌లో 18 రోజుల పాటు పూజలందుకున్న భారీ గణనాథుడిని నిమజ్జన ఉత్సవం శనివారం చేపట్టారు. ప్రిన్స్ యూత్ కమిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రుషి వ్యాస గణపతిని మండపం నుంచి భారీ ట్రాలర్‌పై సాంస్కృతిక ప్రదర్శనల మధ్య ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపుగా సాగరతీరానికి తరలించారు. డప్పు చప్పుళ్ల, నృత్య ప్రదర్శనల మధ్య కోలాహలంగా సాగిన నిమజ్జన యాత్రలో భక్తులు వినాయకుని దర్శించుకున్నారు. 23 అడుగుల రుషి వ్యాస గణనాథుడికి జై బోలో గణేష్ మహరాజ్‌కి అంటూ నివాసిత ప్రాంతాల మీదుగా యువత సందడి మధ్య నిమజ్జన కార్యక్రమం ముగిసింది.

'పార్టీ బలోపేతానికి కృషి'



కేక్ కట్ చేస్తున్న సత్యనారాయణ

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ బలోపేతానికి కృషి చేయడం తో పాటు త్వరలో జరగనున్న కార్పొరేటర్ల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి తన వంతు కృషిచేస్తానని నూతనంగా ఎన్నికైన 44వ వార్డు అధ్యక్షుడు గారపాటి సత్యనారాయణ అన్నారు. 80 అడుగుల రోడ్డులోని రామచంద్రనగర్‌లో శనివారం కేక్ కోశారు. అలాగే వార్డు ఇన్‌చార్జ్‌గా మళ్ల లక్ష్మి, కార్యదర్శిగా పందిరిపల్లి శ్రీను నియమితులయ్యారు.

డెక్‌కు బోలెడు డిమాండ్

... 5వ పేజీ తరువాయి

ఒకే ఒక ఫ్లోర్‌ను నక్కపల్లిలో స్టీల్‌ప్లాంటును ఏర్పాటుచేస్తున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ లిమిటెడ్ కంపెనీ తమ కార్యాలయం కోసం ఇవ్వాలని కోరింది. తమకు కావాలని బెంగళూరుకు చెందిన డిజిటల్ సొల్యూషన్స్ ఐటీ కంపెనీ కోవలెన్స్ అమరావతి నుంచి చెప్పించింది. అదేవిధంగా మరో ఫార్మా కంపెనీ కూడా అదే ఫ్లోర్ కావాలని రికమెండేషన్ చేయించుకుంది. ఒకరికి ఇస్తే మిగిలిన ఇద్దరికి మొండి చేయి చూపించినట్టవుతుందని, బహిరంగ వేలం నిర్వహిస్తామని, ఎవరికి కావాలంటే వారు పాడుకోవాలని వీఎంఆర్‌డీఏ తేల్చి చెప్పింది. ఈ నెల 19న ఖరారవుతుంది.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాల అందజేత

సీతమ్మధార, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధార బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో గల బీజేపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్‌లను పలువురికి అందజేశారు.

గ్రేటర్ విశాఖ 26, 43, 45, 53, 54 వార్డులకు చెందిన బాధితులకు మొత్తం రూ.6,34,006 చెక్కులను అనారోగ్య బాధితులు లంకపల్లి ఆనందరావు, భాగ్యలక్ష్మి, సుంకర రాజేశ్వరి, వరలక్ష్మి, కె.రమణ, ఇప్పిలి పూజ, రామారావు, బి.భవానీ, నమ్మి మహేష్‌కుమార్ తదితరులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సునీల్ అగర్వాల్, కార్పొరేటర్లు హనుక్, శ్రావణి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు

13 ఏళ్ళ తర్వాత ఇంటికి చేరిన జార్ఖండ్ వాసి



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా సభ్యులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న మానసిక రోగి అర్జున్‌ను జార్ఖండ్‌లోని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసుతెలిపారు. అర్జున్ గంజాయి సేవించడం వల్ల మతిస్థిమితం కోల్పోయి భార్యాపిల్లలను వదిలేసి ఇంటి నుంచి వెళ్ళిపోవడం, అతడి భార్య కూడా ఎక్కడికో వెళ్ళిపోవడంతో అర్జున్ సోదరి పిల్లలను 13 ఏళ్ళుగా పోషిస్తోందన్నారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో అర్జున్‌ను మే నెలలో పట్టుకొని వసతిగృహంలో ఆశ్రయం కల్పించి శ్రద్ధా ద్వారా చికిత్స అందించినట్టు వాసు తెలిపారు. అతడు మానసిక ఆరోగ్యం కోలుకోవడంతో జార్ఖండ్‌లోని టాటానగర్ దగ్గర కిదాడి గ్రామంలోని ఇద్దరు కుమార్తెలకు, సోదరికి అప్పగించినట్టు ఆయన తెలిపారు.

జోరుగా పేదల పట్టాల రిజిస్ట్రేషన్లు

... 5వ పేజీ తరువాయి

కార్యాలయాల్లో, సీతమ్మధార మండలానికి చెందిన 381 మంది ద్వారకానగర్ కార్యాలయంలో, పెందుర్తి మండలానికి చెందిన 2,969 మంది పెందుర్తి కార్యాలయంలో, గోపాలపట్నం ప్రాంతానికి చెందిన 2,147 మంది గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సూచించారు.

వారి నుంచి ఏ శాఖ సిబ్బంది అయినా లంచాలు ఆశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హెచ్చరించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి ఆరుద్ర

శత జయంతి కార్యక్రమంలో పలువురు ప్రశంస



ఆరుద్రకు నివాళులు అర్పిస్తున్న అతిథులు, నిర్వాహకులు

సీతంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆరుద్ర (భాగవతుల సదాశివ శంకరశాస్త్రి) బహుముఖ ప్రజ్ఞాశాలి అని పలువురు సాహితీవేత్తలు, మేధావులు కొనియాడారు. శనివారం ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో సాహిత్య అకాడమీ, రైటర్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరుద్ర శతజయంతి సదస్సులో పలువురు రచయితలు, మేధావులు పాల్గొన్నారు. సదస్సులో కీలక ఉపన్యాసం చేసిన రచయిత, విమర్శకుడు మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ కల కళ కోసం కాదని ప్రజల కోసమని నమ్మిన వ్యక్తి ప్రజాకవి ఆరుద్ర అన్నారు. 'పుట్టిన రోజు పండుగే అందరికీ, పుట్టింది ఎందుకో తెలిసేది కొందరికే' అని డాక్టర్ సి.నారాయణ రెడ్డి రాశారని, అది అక్షరాల ఆరుద్రకు వర్తిస్తుందన్నారు. కవిత కోసం పుట్టానని, సామాజిక క్రాంతి కోసం కలం పట్టానని ఆరుద్ర అన్నారని, సమాజానికి చరిత్ర పురోగతి ఉంటుందని శ్రీశ్రీ చెప్పారని, అది ఆరుద్ర పాటించారన్నారు. ఆరుద్ర ఇంటి పేరు కులం పేరు వదులుకొని తనను తాను నిరూపించుకున్నారని కొనియాడారు. ఆరుద్ర జమీందారీ కుటుంబం నుంచి వచ్చారని, ఏవీఎన్‌లో ఉన్న పాఠశాలలో చదువుతున్నప్పుడు స్కూల్ మ్యాగజైన్ కోసం తల్లిదండ్రుల కోసం రాసిన కవిత్వం ఆలోచింపజేసిందన్నారు. ఇంట్లో మేనమామ వరసైన మహాకవి శ్రీశ్రీ, కుటుంబం ప్రభావం ఆరుద్రపై ఉందన్నారు. సైన్స్ అభివృద్ధి చెందుతుందని, సమాజానికి అన్వయించాలని భావించి, ఆరుద్ర చెప్పే వారని తెలిపారు. వర్గ సమాజంలో లోహం ప్రవేశించాక, మూడు వర్గాలు శ్రామిక వర్గం, మధ్య తరగతి, ఉన్నత వర్గం వచ్చాయన్నారు. అయితే శ్రామిక వర్గం వైపు ఆరుద్ర నిలబడ్డారని తెలిపారు. తొలి నాళ్ల నుంచి సైంటిఫిక్ దృక్పథాన్ని ఆరుద్ర అలవర్చుకున్నారన్నారు. సమాజం పట్ల నిబద్ధత గల వ్యక్తి ఆరుద్ర అని కొనియాడారు.

సదస్సుకు అధ్యక్షత వహించిన రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో, ముఖ్యంగా ఈ కార్పొరేట్ యుగంలో బయట ప్రపంచం ఎలా ఉంది? ఎలా స్పందించాలనే సామాజిక అవగాహన యువతకు లేకుండా పోయిందన్నారు. ఈ తరుణంలో యువతకు సామాజిక అవగాహన అవసరమని పేర్కొన్నారు. కర్ణాటకలోని పాఠశాల విద్యార్థులకు ఆ ప్రోత్సాహం ఉంటుందని, ఇక్కడ కూడా అలాంటి విద్యావిధానం ఉండాలని సూచించారు. సాహిత్య అకాడమీ కన్వీనర్ సి.మృణాళిని స్వాగతం ఉపన్యాసం చేస్తూ ప్రస్తుతం ఆరుద్ర వంటి కవుల శత జయంతి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా నేటి తరానికి అలాంటి గొప్ప వ్యక్తుల గురించి తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. మహాకవి శ్రీశ్రీ తన గురువు ఆరుద్ర అని చెప్పుకునే వారని గుర్తు చేశారు. కథలు, నాటకాలు, పాటలు, చదరంగం తదితర రంగాల్లో ఆరుద్ర ప్రావీణ్యం సంపాదించారన్నారు. ఆరుద్రను స్మరిస్తూ మంచి కార్యక్రమాన్ని రైటర్స్ అకాడమీతో కలిసి ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. మేడా మస్తాన్ రెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించిన సదస్సులో గాంధీ సెంటర్ కార్యదర్శి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉప కులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఉస్మానియా యూనివర్శిటీ తెలుగు శాఖ ప్రొఫెసర్ ఎస్.రఘు, రచయితలు తలతోటి పృథ్వీరాజు, అయ్యగారి సీతారత్నం, ఆచార్య బాబీవర్ధన్, అనిల్ డ్యానీ, రాంభట్ల నృసింహశర్మ, బాలసుధాకర్ మౌళి, చింతకింద శ్రీనివాసరావు, బులుసు వెంకటేశ్వర్లు, కేవీఎస్ మూర్తి, అనురాధ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొని ఆరుద్ర జీవిత విశేషాలు, రచనలు, పోరాట పటిమ, తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు సాహితీ అభిమానులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణకు వ్యాకినేషన్

సీతమ్మధార, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ 9 నుంచి 14 ఏళ్ల వయస్సు గల ఆడపిల్లలకు శనివారం గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణ ఉచిత వాక్సినేషన్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు టీకాలు చేయాల్సి ఉండగా, తొలి రోజునే 300 మందికి పైగా ఆడపిల్లలు వ్యాక్సిన్ వేసుకున్నారని తెలిపారు. 670 మంది ఆడపిల్లలు తమ పేర్లను ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్నారని లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ తెలిపారు.

ముగిసిన అప్పన్న ఆభరణాల తనిఖీ

» అర్ధరాత్రి నివేదిక తయారీ! » కమిటీ సభ్యుల సంతకాలు

సింహాచలం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి స్వర్ణ, రజిత ఆభరణాల తనిఖీ ముగిసినట్టు ఫైవ్ మెన్ కమిటీ హెడ్, విజయనగరం జిల్లా దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు. భక్తులు కానుకలుగా అందజేసిన ఆభరణాలలో వ్యత్యాసాలు ఉన్నట్టు కడపకు చెందిన స్వచ్ఛంద సేవా కార్యకర్త కె.ప్రభాకరాచారి తొలుత దేవదాయ శాఖ కమిషనర్‌కు, ఆ తర్వాత విశాఖ జిల్లా కలెక్టర్‌కు, అదే విధంగా దేశ ప్రధానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్..కాకినాడకు చెందిన ఆర్‌జేసీ సుబ్బారావును విచారణాధికారిగా నియమించగా ఆయన అదే శాఖకు చెందిన జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజును పంపించారు. ఆయన తన నివేదికను రాష్ట్ర అధికారులకు సమర్పించారు. దానిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండానే మరొకసారి సమగ్ర విచారణకు ఫైవ్ మెన్ కమిటీని దేవదాయ శాఖ కమిషనర్ నియమించారు. ఆ కమిటీ సభ్యులు ఇటీవల ఐదు రోజులపాటు దేవాలయ భాండాగారంలో, సింహాచలంలోని జాతీయ బ్యాంకుల్లో ఉన్న ఆభరణాలను రికార్డుల్లో ఉన్న వివరాలతో సరిపోల్చి చూశారు. అనంతరం శుక్రవారం అర్ధరాత్రి వరకూ నివేదికలు రహస్యంగా తయారుచేసి, దానిపై కమిటీ సభ్యులంతా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కమిటీకి సారథ్యం వహిస్తున్న ప్రసాద్ మాట్లాడుతూ నివేదికను అతి త్వరలోనే దేవదాయ శాఖ కమిషనర్‌కు అందజేస్తామని తెలిపారు. ఆభరణాల లెక్కలన్నీ దాదాపు సరిపోయినట్టేనని చెప్పారు.

డైట్‌కు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

కేటాయించారు. ఇంకా ఆడియో విజువల్ ఎయిడ్స్, డిజిటల్ హార్డ్‌వేర్ అండ్ సాఫ్ట్‌వేర్, ఇంటర్‌నెట్ సౌకర్యం, ప్రత్యేకించి వెబ్‌సైట్ రూపకల్పన, స్మార్ట్ తరగతుల నిర్మాణానికి రూ.1.16 కోట్లు, ప్రహరీ గోడ, సెక్యూరిటీ పోస్టు నిర్మాణం, సీసీ టీవీ, ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్ ఏర్పాటుకు రూ.0.91 కోట్లు, డైట్ అధ్యాపకుల కోసం క్వార్టర్ల నిర్మాణాలకు రూ.1.03 కోట్లు వెచ్చించనున్నారు. అలాగే తాగునీటి సదుపాయం, క్యాంటీన్ భవనం, గార్డెనింగ్, ఫర్నీచర్, వాహనాల పార్కింగ్, సోలార్ ఎక్విప్‌మెంట్, క్రీడలకు సంబంధించి పరికరాలు, నిర్వహణ తదితర అంశాలకు రూ.1.67 కోట్లు కేటాయించారు. నూతన భవనాల నిర్మాణం, ఇతరత్రా వసతుల కల్పనకు టెండర్లు ఆహ్వానించారు. రెండు సంవత్సరాల్లో భవనాలు నిర్మించి వసతులు కల్పించాలని సమగ్ర శిక్షా ఉన్నతాధికారులు నిర్ణయించారు.

కేజీహెచ్‌లో అనధికార బాయ్‌ల దందా

... 5వ పేజీ తరువాయి

ఉంటున్నారు. వారిలో కొందరు మద్యం సేవించి ఉంటారు. అంబులెన్స్ కాని, ఇతర ఏదైనా వాహనంలో రోగిని తీసుకువస్తే వెంటనేవారు అక్కడకు చేరుకొని, అవసరమైన వీల్ చైర్, వీల్ బెడ్‌లు సమకూర్చి రోగిని లోపలకు తీసుకు వెళతారు. అక్కడ ఉన్న డ్యూటీ డాక్టర్లకు చూపించినట్టు నటించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఎవరైనా డబ్బులు ఇవ్వకుంటే దాడి పాల్పడుతున్నారు. చాలా ఏళ్లుగాఈ దందా కొనసాగుతోంది. రోగులు, వారి బంధువులపై దాడులకు పాల్పడిన సంఘటనలు కోకొల్లలు. ఈ విషయం ఆస్పత్రిలోని ఉన్నతాధికారులకు తెలిసినా ఎటువంటి చర్యలూ తీసుకోరు. కాగా క్యాజువాలిటీలో పోలీసు అవుట్ పోస్టు ఉన్నా..ఈ దందా గురించి పట్టించుకోకపోవడం గమనార్హం. అనధికార వార్డు బాయ్ దాడి గురించి ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంఓ సీహెచ్ శ్రీహరి వద్ద ప్రస్తావించగా బాధితుడు ఈశ్వరరావు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. అనధికార వ్యక్తులను ఆస్పత్రి నుంచి బయటకు వంపించేశామని, సోమవారం నుంచి మరిన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

స్థానికులకు ఉక్కు మొండిచెయ్యి

... 5వ పేజీ తరువాయి

విభాగంలోనైనా పనిచేసుకోవచ్చు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ఇప్పుడు ఈ సేఫ్టీ పాస్‌లు ఇస్తున్నారు. అంటే తొలగించిన 4,500 కాంట్రాక్ట్ వర్కర్లలో ఎవరికీ పనిచేసే అవకాశం ఇవ్వకుండా పొరుగు రాష్ట్రాల వారిని తెప్పించి పనిచేయిస్తున్నారు. దీనిపై కాంట్రాక్ట్ వర్కర్ల సంఘం శనివారం ఆందోళనకు దిగింది. శిక్షణ కార్యాలయం ముందు నిరసన వ్యక్తంచేసింది. స్టీల్ ప్లాంటుకు భూములు ఇచ్చిన నిర్వాసితులకు, ఆ తరువాత ఇక్కడి స్థానికులకు ప్లాంటులో పనిచేసే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత నాలుగు దశాబ్దాలుగా ఆ నిబంధన అమలవుతున్నదని, ఇప్పుడు దానిని పక్కన పెట్టి పొరుగు రాష్ట్రాల వారితో పనిచేయిస్తున్నందున తాము ఆందోళనలు ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. మే నెలలో తొలగించిన కాంట్రాక్టు వర్కర్లలో 300 మంది నిర్వాసితులు ఉన్నారని, వారిని వీలైనంత త్వరగా మళ్లీ తీసుకుంటామని ఇటీవల జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కు సీఎండీ సక్సేనా హామీ ఇచ్చారని, దానిని తుంగలో తొక్కారని, స్థానికులకు అన్యాయం చేస్తున్నారని సంఘ నాయకులు ఆరోపించారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులకు పనులు ఇవ్వాలని, లేదంటే నిరవధికంగా ఆందోళనలు కొనసాగిస్తామని నాయకులు ప్రసాద్, పరంధామయ్య, వంశీకృష్ణ ప్రకటించారు.

19న డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుకు విద్యా శాఖ సన్నాహాలు చేస్తోంది. ఉత్తరాంధ్రలో 2,660 మందికి నియామక పత్రాలు అందజేస్తారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ, గురుకులాలు/మోడల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, టీజీటీ, పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు తోడుగా కుటుంబ సభ్యుల్లో ఒకరిని అభినందన సభకు అనుమతిస్తారు. ఉత్తరాంధ్ర నుంచి అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను తీసుకువెళ్లడానికి సుమారు 120 బస్సులు ఏర్పాటుచేస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి ఈనెల 18వ తేదీ ఉదయం బస్సులు బయలుదేరతాయి. ఆరోజు రాత్రికి విజయవాడ సమీపంలో వారికి వసతి ఏర్పాటుచేస్తారు. 19వ తేదీ ఉదయం అభినందన సభలో జిల్లాల నుంచి ఎంపిక చేసిన కొద్దిమందికి సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఇతర ప్రముఖులు నియామక పత్రాలు అందజేస్తారు. మిగిలిన వారికి అదే ప్రాంగణంలో ఏర్పాటుచేసే కౌంటర్ల ద్వారా పత్రాలు ఇవ్వనున్నారు. అభినందన సభ ముగిసిన తరువాత తిరిగి అవే బస్సుల్లో జిల్లాలకు తీసుకువస్తారు. ఆ తరువాత ఎంపికైన అభ్యర్థులకు పాఠశాలల నిర్వహణ, బోధన, పరిపాలన, ఇతర అంశాలపై జిల్లాల వారీగా పది రోజులపాటు శిక్షణ ఇస్తారు. ఇప్పటివరకూ డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లను కౌన్సెలింగ్‌లోనే పాఠశాలలు కేటాయించేవారు. ఈ పర్యాయం పది రోజుల శిక్షణ ఇచ్చిన తరువాత పాఠశాలలకు పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఉద్యోగికి శిక్షణ అవసరమని విద్యా శాఖ అధికారి ఒకరు తెలిపారు. దసరా సెలవులు తరువాత కొత్త టీచర్లకు పాఠశాలలు కేటాయించనున్నట్టు పేర్కొన్నారు.

పార్కుకు ఎసరు!

... 5వ పేజీ తరువాయి

కేటాయించిన భూమి తమదని, ఆ భూమిని తమ కుటుంబ పెద్దలు విక్రయించలేదంటూ నకిలీ పత్రాలను తయారుచేశారు. పార్కులో చిన్నపాటి షెడ్ వేసి తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు యత్నించారు. ఈ విషయం కొందరు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా..వారు పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేశారు. పార్కులోని ఆక్రమణలను తొలగించి చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ వేశారు. అయితే ఇప్పుడు రుషికొండ ప్రాంతంలో భూములు, స్థలాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఆ ప్రాంతంలో చదరపు గజం ధర రూ.80 వేలు వరకు పలుకుతోంది. దీనినిబట్టి 2,400 గజాల స్థలం విలువ దాదాపు రూ.20 కోట్లు ఉంటుంది. అంతటి ఖరీదైన పార్కు స్థలాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవాలనే నిశ్చయంతో వైసీపీ చోటానేత తిరిగి తన ప్రయత్నాలను ప్రారంభించారు. గతంలో లేఅవుట్‌కు భూములు విక్రయించిన వారి వారసుల పేరుతో కొందరిని కూడగట్టారు. పార్కు స్థలం తమది అంటూ సృష్టించిన నకిలీపత్రాలను చూపించి ఆ స్థలం విక్రయించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ స్థలంలోకి ఇతరులెవరూ అడుగుపెట్టకుండా కొందరు రౌడీలను ఏర్పాటుచేశారు. ఆ భూమికి ఎలాంటి తగాదాలు లేవని చెప్పి ఇటీవల ఒకరికి విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగా రూ.కోటి అడ్వాన్సుగా వైసీపీ చోటా నేత అందుకున్నట్టు స్థానికులు పేర్కొంటున్నారు. జీవీఎంసీ అధికారులకు దీనిపై సమాచారం ఇచ్చినా స్పందించలేదని ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ జోన్-2 అధికారులు స్పందించి కబ్జారాయుళ్లకు ముకుతాడు వేయకపోతే పార్కు స్థలం అన్యాక్రాంతం అయిపోవడం ఖాయమని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



పలు కేసుల్లో బాధితులకు చెక్కు అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం

మహారాణిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : లోక్ అదాలత్‌లతో కక్షిదారులకు సత్వరమే న్యాయం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షుడు చిన్నంశెట్టి రాజా అన్నారు, శనివారం జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 36 లోక్ అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేసి 124 మోటర్ వాహన ప్రమాద కేసులను పరిష్కరించారు. అలాగే 185 సివిల్ కేసులు, 10,190 క్రిమినల్ కేసులు, 239 ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ చేసి, నష్టపరిహారంగా రూ. 25 కోట్ల చెల్లింపులు చేపట్టారు. ఈ కేసులను పరిష్కరించడం ద్వారా రాష్ట్రంలో విశాఖ జిల్లా 4వ స్థానంలో నిలిచినట్టు జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

కనకమ్మకు లక్ష తులసీ దళార్చన



మహారాణిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లో ఉన్న కనక మహాలక్ష్మి అమ్మవారికి శనివారం లక్ష తులసీ దళార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో అమ్మవారిని మేల్కొలిపి ప్రభారాధనలు పూర్తి చేశారు. అనంతరం అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం జరిపి,లక్ష తులసీ దళార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 81 మందికి రూ. 8 లక్షల జరిమానా

ఆనందపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన 81 మందికి భీమిలి కోర్టు రూ.10 వేలు చొప్పున మొత్తం రూ. 8.10 లక్షల జరిమానా విధించింది. ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 81 మందిపై కేసులు నమోదు చేశారు.వారిని శనివారం భీమిలిలో 2వ అదనపు జూనియరు సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ పి. స్వాతిభవానీ ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున అపరాధ రుసుం విధించారు.

స్పా ముసుగులో వ్యభిచారం

... 5వ పేజీ తరువాయి

నిర్వహిస్తున్నారు. మసాజ్ చేయడానికి అని చెప్పి ఉద్యోగంలోకి తీసుకున్న మహిళలను బలవంతంగా అందుకు ఉపయోగిస్తున్నారు. దీనిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో శనివారం గాజువాక పోలీసులతో కలిసి దాడి చేశారు. నిర్వాహకురాలితోపాటు విటుడిని అరెస్టు చేశారు. మహిళలను పునరావాస కేంద్రానికి అప్పగించారు.



మార్కెట్‌లో మూసి ఉన్న దుకాణాలు



అనుపోత్సవంలో పాల్గొన్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, తదితరులు

ఘనంగా గణేశ్ విగ్రహం అనుపోత్సవం

» పదేళ్ల తరువాత పూర్ణా మార్కెట్‌కు సెలవు
» స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసిన వ్యాపారులు

మహారాణిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పూర్ణామార్కెట్‌లో వినాయక ఉత్సవాల్లో భాగంగా శనివారం అనుపోత్సవం నిర్వహించారు. పదేళ్ల తరువాత వ్యాపారులు మార్కెట్‌కు సెలవు ప్రకటించి దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు.ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న ఈ మార్కెట్‌కు ఇప్పటివరకూ సెలవు ప్రకటించలేదు. ఎలాంటి ఉపద్రవం వచ్చినా.. బంద్‌లు, తుఫాన్లు వచ్చినా మార్కెట్‌ను తెరిచేవారు. ఏటా ఇక్కడ వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. ముఖ్యంగా అనుపోత్సవాన్ని వ్యాపారులు కలిసికట్టుగా జరుపుతారు. ఈమేరకు సర్దార్ వల్లాబాయ్ పటేల్ వర్తక సంఘం అధ్యక్షుడు దాడి రామకృష్ణ ఆధ్వర్యంలో గణేశ్ ప్రతిమ అనుపోత్సవాన్ని వైభవంగా జరిపారు. మార్కెట్‌లో అన్ని దుకాణాలను వ్యాపారులు స్వచ్ఛందగా మూసి వేసి, వేడుకల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు ఐదు వేల మంది స్వామివారి ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య గణేశ్ ప్రతిమను వైభవంగా ఊరేగించారు.

'చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి'

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : లిక్కర్ స్కామ్‌లో జగన్ సంపాదించిన డబ్బుతో మెడికల్ కాలేజీల నిర్మాణాలను పూర్తి చేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు, విద్యార్థుల భవిత కోసం మంత్రి నారా లోకేశ్ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. కేంద్రం విడుదల చేసిన మెడికల్ కాలేజీల నిధులను నేబాగ్ రుణాల ద్వారా మాజీ సీఎం జగన్ రుషికొండ కట్టడాలకు, విందు, వినోదాలకు ఖర్చుపెట్టి వృథా చేశారని ఆరోపించారు. ఇప్పుడు సీఎం చంద్రబాబునాయుడు మెడికల్ కాలేజీలను అమ్మేస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నాటి వైసీపీ ప్రభుత్వమే కారణమని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కువ మంది రైతులు జగన్ సర్కార్‌లోనే ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ లేనిపోని ఆరోపణలు చేస్తుందని విమర్శించారు. సమావేశంలో ఆయనతో పాటు జుంజురు గోవింద్, వాసుపల్లి రాంబాబు, జింజూరు శివ ఉన్నారు.

కొండమేకపై కుక్కల దాడి



గాయాలతో అపార్టుమెంట్ సెల్లార్‌లో దాక్కున్న కొండ మేక

కొమ్మాది, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కంబాలకొండ అటవీ ప్రాంతం నుంచి శనివారం సాయంత్రం శంభువానిపాలెం చెక్‌పోస్టు ద్వారా ఓ కొండమేక జనావాసాల్లోకి వచ్చింది. దాన్ని చూసి కుక్కలు అరవడంతో భయపడి షిప్‌యార్డు కాలనీ వైపు పరుగులు తీసింది. అటువైపు నుంచి కూడా కుక్కలు వెంట పడి దాడి చేయడంతో గాయాలతో సమీపంలోని ఎంవీవీ ప్లాజా అపార్టుమెంట్ సెల్లార్‌లోకి ప్రవేశించింది. కొండ మేకను చూసిన అపార్టుమెంట్ నివాసి సీతారామ్మూర్తి గేటు వేసి, కుక్కలు లోపలికి రాకుండా అడ్డుకోవడంతోపాటు మేకకు మంచినీరు, ఆహారం అందించారు. ఈ విషయాన్ని ఆయన సామాజిక మాధ్యమంలో పోస్టు చేయడంతో అటవీ శాఖాధికారులకు సమాచారం తెలిసింది. ఈమేరకు రేంజ్ అధికారి శాస్త్రి, బీట్ గార్డు ఎల్లారావు, జూ వైద్యుడు భాను ప్రతాప్ అక్కడికి చేరుకున్నారు. అత్యవసర చికిత్స అనంతరం కొండమేకను ప్రత్యేక వాహనంలో జూపార్కుకు తరలించారు.

రాడిసన్ బ్లూలో వసుంధర డైమండ్స్ మెగా ఎగ్జిబిషన్ ప్రారంభం



గిరిజన విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు ఇస్తున్న సంస్థ సభ్యులు

సాగర్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో వసుంధర డైమండ్స్ మెగా ఎగ్జిబిషన్ శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా వసుంధర డైమండ్ రూఫ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. వసుంధర మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ జరుతుందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలంలోని తుమ్మలోవ గిరిజన గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు పిల్లలకు చదువు, ఉచిత వైద్య శిబిరాలు వంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ తొట్టెంపూడి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న న్యాయవాది తులసీరామ్

బీజేపీలో చేరిన న్యాయవాది తులసీరామ్

పెందుర్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజకీయ అనుభవం ఉన్న న్యాయవాది మళ్ల తులసీరామ్ బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తులసీరామ్‌ను కండువా కప్పి పార్టీలోకి శనివారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆదర్శంగా బీజేపీలో చేరానని చెప్పారు. తులసీరామ్ 1999 నుంచి 2008 వరకు ఎన్ఎస్‌యూఐలో విశాఖ నగర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. అనకాపల్లి కాంగ్రెస్ పార్లమెంటరీ, యువజన అధ్యక్షుడిగా పీసీసీ లీగల్ సెల్ సభ్యుడిగా పనిచేశారు.

తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలిగా సత్యవతి



సత్యవతి

అగనంపూడి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గం తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలిగా అగనంపూడి బీసీ కాలనీకి చెందిన గంతకోరు సత్యవతిని నియమించారు. ఈ మేరకు శనివారం పార్టీ అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రసాదాల శ్రీనివాసరావు, 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మికి సత్యవతి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రాట ఉత్సవం

ఆటోనగర్,సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రులను పురస్కరించుకుని 87వ వార్డు కణితి రజక వీధిలో పందిరి రాట ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 22 నుంచి వచ్చే నెల 4 వరకు దసరా వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల డైరెక్టర్లగా ఇద్దరికి చోటు

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా గాజువాకకు చెందిన టీడీపీ సీనియర్ నేత ప్రసాదుల శ్రీనివాస్ నియమితులయ్యారు. అలాగే రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా దక్షిణ నియోజకవర్గ టీడీపీ నాయకుడు గోడి నరసింహాచారిని నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కిందపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ**: వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 28, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 18, క్యారెట్ 46, దొండకాయలు 38, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, దేముడుచిక్కుడు 76, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, మామిడిఅల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	132
లైవ్ ధర	152
విత్ స్కిన్	274
స్కిన్‌లెస్	284

పడి లేచిన కెరటం హెచ్‌పీసీఎల్

భారీ విస్ఫోటం జరిగి నేటికి 28 ఏళ్లు



మల్కాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పడిలేచిన కెరటంలా హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ముందుకు సాగుతోంది. హెచ్‌పీసీఎల్‌లో భారీ విస్ఫోటం సంభవించి ఆదివారం నాటికి 28 ఏళ్లు అవుతుంది. అప్పట్లో ఈ దుర్ఘటనలో 62 మంది మృత్యువాత పడ్డారు. నాడు ఈ ప్రమాదం అందరినీ తీవ్ర విషాదానికి గురిచేసింది. అనంతరం అనేక జాగ్రత్తలు తీసుకుంటూ హెచ్‌పీసీఎల్ అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ.. సంస్థను విస్తరించుకుంటూ.. చమురు శుద్ధిలో అంతర్జాతీయంగా పోటీ పడుతూ ముందుకు సాగుతోంది. విశాఖ సముద్ర తీరాన 1957లో కాల్టాక్స్ పేరుతో ఏర్పడిన ఆయిల్ పరిశ్రమ ఇప్పుడు అంతర్జాతీయంగా ఖ్యాతినార్జించిన హెచ్‌పీసీఎల్‌గా రూపాంతరం చెందింది. 1997 నాటి విస్ఫోటంతో ఇక హెచ్‌పీసీఎల్ పనైపోయిందంటూ అందరూ భావించారు. కానీ పడిలేచిన కెరటంలా హెచ్‌పీసీఎల్ తక్కువ కాలంలోనే మళ్లీ సంస్థలో చమురు శుద్ధి పనులు చేపట్టి అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. ఇందుకు అధికారులు, కార్మికుల సమష్టి కృషే కారణమని చెప్పవచ్చు.

చరిత్ర సృష్టించిన విశాఖ రిఫైనరీ

క్రూడాయిల్ ఆయిల్ మేనేజ్‌మెంట్‌లో విశాఖ రిఫైనరీ ఆవిష్కరణలకు నాంది పలికి దేశంలోనే తొలిసారిగా క్రూడ్ కేవర్న్ స్టోరేజీ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించింది. భూగర్భంలో చమురు, గ్యాస్ నిల్వలు చేసి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. మార్కెట్ పరిస్థితులను బట్టి అనుకూలంగా ఉన్నప్పుడు క్రూడ్ కొనుగోలు చేయడం, అప్పుడప్పుడు చమురు సరఫరాలో అంతరాయం కలిగినా ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం సేవలందిస్తోంది. ఒకపక్క సంస్థను అభివృద్ధి చేస్తూనే మరోపక్క పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

విస్తరణ దిశగా పరుగులు

ప్రస్తుతం హెచ్‌పీసీఎల్ విస్తరణ దిశగా పరుగులు తీస్తోంది. రూ.30.609 కోట్ల పెట్టుబడితో 8.3గా ఉన్న చమురు శుద్ధి సామర్థ్యాన్ని 15 ఎంఎంటీపీఏకు పెంచింది. ఇందులో భాగంగా ఎంఎంటీపీఏ క్రూడ్ డిస్టిలేషన్ యూనిట్ (సీడీయూ-4)ను విజయవంతంగా నిర్మించి 2023 మార్చిలో ప్రారంభించారు. అదే ఏడాది అక్టోబరులో అతిపెద్ద ఫుల్ కన్వర్షన్ హైడ్రో కాకర్ యూనిట్‌ను ప్రారంభించింది. అంతేకాక ఆసియాలోనే రెండో అతిపెద్ద హైడ్రోజన్ జనరేషన్ యూనిటు, సల్ఫర్ రికవరీ యూనిట్ల సామర్థ్యాన్ని 450 టీపీడీకి పెంచుకుంది. వీటిద్వారా పర్యావరణ నియమాలను పాటిస్తూ శుభ్రమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ ప్రాజెక్టుల్లో మరో ముఖ్యమైనది రిసైడ్యూ అప్‌గ్రేడ్ ఫెసిలిటీ (రఫ్). దీని ద్వారా మరిన్ని లాభాలు సాధించే దిశగా రిఫైనరీ ముందుకు సాగుతోంది.

94వ వార్డులో పంచకర్ల పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు

వేపగుంట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు ప్రహ్లాదపురం, పల్లినారాయణపురం, అంజనాద్రి కాలనీ పరిసర ప్రాంతాల్లో శనివారం ఎమ్మెల్యే పంచకర్ల పర్యటన చేశారు. ఈ సందర్భంగా ప్రహ్లాదపురం పైడి మాంబకాలనీలో గెడ్డలను పరిశీలించారు. గెడ్డల్లో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా అంజనాద్రి కాలనీలో రహదారులు కాలువలు పరిశీలించి వాటిని అభివృద్ధి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. వార్డులో మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యం కల్పించనున్నట్టు పంచకర్ల తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రాపర్తికన్నా, జడ్సీ హెచ్.శంకరరావు, ఈఈ దీలిప్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు రక్షణకు కూటమి ప్రభుత్వం కృషి

» టీఎన్‌టీయూ ఉపాధ్యక్షుడు రామ్మోహన్ కుమార్

గాజువాక,సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్లాంటను రక్షించుకునేందుకు కూటమి ప్రయత్నింస్తుంటే వామ పక్షాలు, ఇంటక్ కార్మిక యూనియన్లు వైసీపీతో చేతులు కలిపి ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించేది లేదని రాష్ట్ర టీఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు విల్లా రామ్మోహన్ కుమార్ హెచ్చరించారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రుల హక్కుగా భావించే ప్లాంటను ఈ దుస్థితికి రావడానికి వైసీపీ, వామపక్ష కార్మిక యూనియన్లే కారణమని స్పష్టం చేశారు. ప్లాంట్‌ను కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కాంట్రాక్టు పనుల్లో నిర్వాసితులను కొనసాగిస్తూ భవిష్యత్తులో జరగనున్న ఉపాధి కల్పనలో నిర్వాసితులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఉక్కు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారని చెప్పారు.

నిర్వాసితులు ఐక్యంగా ఉండాలి

» 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీఐఐసీ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులు సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉండాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. తుంగ్లాంలో శనివారం జరిగిన ఏపీఐఐసీ నిర్వాసితుల సమావేశంలో ఆయన మాట్లడుతూ నిర్వాసితులకు కూమి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించడం అభినందనీయమన్నారు. ఇంకా స్థలాలు రాని వారి జాబితాను అధికారులకు అందజేద్దామన్నారు. ఈ సమావేశంలో నిర్వాసిత నాయకులు, కాలనీ నాయకులు పాల్గొన్నారు.

15 నుంచి పశువులకు వ్యాధి సోకకుండా టీకాలు

పెందుర్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో నాలుగు నెలలు దాటిన దూడలకు గాలి కుంటు వ్యాధి టీకాలు సోమవారం నుంచి వేస్తున్నామని పశువైద్యాధికారి డాక్టర్ జగన్మోహనరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులు పాటు ఈ శిబిరాలను నిర్వహించనున్నామని, పాడి రైతులు ఈ శిబిరాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియగా కొనసాగాలి

» పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మాట్లాడిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న పల్లా శ్రీనివాసరావు, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు తదితరులు

పెదగంట్యాడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కార్యక్రమాలు నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, ఇవి ఏదశలోను ఆగిపోకూడదని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన ఆధునిక ల్యాబొరేటరీ భవన్నాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదగంట్యాడ ప్రాంతంలోని ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించేందుకు ఇక్కడ అత్యాధుని సౌకర్యాలతో ల్యాబొరేటరీ నిర్మించడం జరిగిందన్నారు. దీనికి అవసరమైన పరికరాలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమకూర్చుతుందన్నారు. అనంతరం గ్రౌండ్‌లో రూ.15.85 లక్షలు, దాసరివీధి గ్రౌండ్‌లో రూ.16.70 లక్షల నిధులతో జిమ్‌ను ప్రారంభించారు. పెదగంట్యాడలో రూ.19.98లక్షలతో సీసీ రోడ్డు రూ.19.99లక్షలతో సీసీ డ్రైన్, కండిపిల్లి వీధిలో రూ. 19.75 లక్షలతో సీసీడ్రైన్, సీసీ రోడ్డు, పాత అయ్యన్నపాలెంలో రూ. 19.55లక్షలతో మరుగుదొడ్ల సముదాయం, రూ.19.98 లక్షలతో కమ్యూనిటీ హాలు, నీలాపువీధిలో రూ. 19.56లక్షలతో కమ్యూనిటీ హాలు, ఆధునీకరణకు ఆయన శంకుస్థాన చేశారు. ఈ కార్యక్రమాల్లో వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, జోనల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి, విశాఖ పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే జీవీఎంసీ 76వవార్డు పరిధి గాంధీనగర్‌లో రూ.18లక్షల వ్యయంతో నిర్మించిన సామాజిక భవనాన్ని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అసోసియేషన్ సొంత వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించుకోవడం ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివవాసరావు, జోనల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి, అసోసియేషన్ ప్రతినిధులు తెంటు సత్యనారాయణ, గొర్లె రామునాయుడు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే 65వ వార్డులో బీసీ రోడ్డు నుంచి రాజీవ్‌గాంధీ స్టేడియం వరకు ఉన్న రోడ్డును రూ.3 కోట్లతో విస్తరించేందుకు శనివారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు రట్టి వాసు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా విజ్ఞాన్‌లో టెక్నికల్ ఫెస్ట్ ప్రారంభం



విద్యార్థుల ప్రాజెక్టులను చూస్తున్న శ్రీధర్‌సింగ్

అగనంపూడి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ కళాశాలలో విద్యార్థుల ఆటపాటల మధ్య 'విస్టా 2025 టెక్నికల్ ఫెస్టివల్' శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగ విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా వివిధ సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మార్పులకు తగినట్టు విద్యార్థులను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కళాశాలలో ఏటా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు అధ్యాపకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) అదనపు జనరల్ మేనేజర్ శ్రీధర్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంపై విద్యార్థులు పట్టు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని అన్నారు. శాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు తగినట్టు విద్యార్థులు రాణించాలని సూచించారు. చదువు ఎంత ముఖ్యమో సృజనాత్మకమైన ఆలోచనలు, నాయకత్వ లక్షణాలు మెరుగుపరుచుకోవడం అంతే ముఖ్యమని అన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను తిలకించారు. కళాశాల యాజమాన్యం శ్రీధర్ సింగ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు మరిడిమాంబకు పూజలు

మల్కాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆరాధ్య దైవం మరిడిమాంబ అమ్మవారికి ఆదివారం నుంచి రోజుకో కులం వారు పూజ చేయనున్నామని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ 1997 సెప్టెంబరు 14న హెచ్‌పీసీఎల్‌లో జరిగిన విస్ఫోటం నుంచి తమను దేవత కాపాడారని నముతూ 27 ఏళ్లగా పూజలు చేస్తున్నామని వెల్లడించారు. తమ గ్రామాన్ని అమ్మవారే కాపాడారని నమ్ముతున్నారు.



మేయర్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పంచకర్ల

మేయర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల అస్వస్థతకుగురై ఆస్పత్రిలో చికిత్స తీసుకుని విశ్రాంతి తీసుకుంటున్న నగర మేయర్ పీలా శ్రీనివాసరావును ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మేయర్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పంచకర్ల వెంట మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వేగి దివాకర్, గవర కార్పొరేటర్ డైరెక్టర్ వేగి పరమేశ్వరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

» ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గాజువాక నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 68 వార్డు పరిధిలోని రూ. 1.62 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని జరిగే అభివృద్ధి పనులకు ప్రజలు పార్టీలకు అతీతంగా సహకరించాలని కోరారు. వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష మాట్లాడుతూ అక్కిరెడ్డిపాలెం ప్రధాన కాలువ నిర్మాణంతో పాటు మిండి, అక్కిరెడ్డిపాలెం, పంచవటి కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న కాలుష్య సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు ఎస్.అనంతలక్ష్మి, శీరం రాజేశ్, ఈటి శ్రీను, సంద్రాన నూకరాజు, మాకా షాలినీ, డొప్ప అప్పలరాజు, ఎ.జయలక్ష్మి, ఈటి సురేశ్, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా బోర్డులు మారలేదు

» ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై వైఎస్సార్ పేరు



మిండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై వైఎస్సార్ పేరు

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా పలు ప్రభుత్వ భవనాలపై వైసీపీ హయాంలో పెట్టిన పేర్లే దర్శనమిస్తున్నాయి. 68 వార్డులోని మిండి చెరువుకు ఆనుకుని రూ.1.2 కోట్ల వ్యయంతో నిర్మించిన వైఎస్ఆర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 2023లో అప్పటి రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి విడదల రజనీ, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినా ఇంకా ఈ ఆరోగ్య కేంద్రంపై వైఎస్సార్ పేరు ఉండడం పట్ల వార్డుకు చెందిన కూటమి నాయకులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ ఆరోగ్య కేంద్రానికి సమీపంలో శనివారం జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన కూటమి నాయకులు ఈ బోర్డును చూసి అధికారులను ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని కేంద్రాలపై ఉన్న పేర్లను తొలగించి ఈ కేంద్రంపై తొలగించకపోవడం ఏమిటని జీవీఎంసీ అధికారులను నిలదీశారు.

సమస్యలు పరిష్కరించాలని పల్లాకు వినతి

అగనంపూడి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79, 85 వార్డులు అగనంపూడి, పరిసర ప్రాంత గ్రామాల్లో తిష్ఠ వేసిన సమస్యలు పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు స్థానిక కూటమి నేతలు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయనకు వివరించారు. వినతిలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ భవనంలో డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, ఫార్మాసిటీ నిర్వాసితులకు ఫార్మా పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పనకు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానికంగా రైతు బజార్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు ప్రసాద్, 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దేశేంద్ర, కూటమి నేతలు పాల్గొన్నారు.

రైతు బజారును పరిశీలించిన మార్కెటింగ్ చైర్మన్



ఉల్లిపాయలను పరిశీలిస్తున్న చైర్మన్ ఎలమంచిలి అపర్ణప్రసాద్, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉక్కునగరంలో ఉన్న రైతు బజార్‌ను శనివారం మార్కెటింగ్ శాఖ చైర్మన్ ఎలమంచిలి అపర్ణ ప్రసాద్, వైస్ చైర్మన్ వింకు మహంతి చంద్రశేఖర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతుబజార్‌లోని డ్వాక్రా గ్రూపు పీహెచ్‌పీ కౌంటర్‌ల్లో అమ్ముతున్న కర్నూల్ ఉల్లిపాయలను పరిశీలించారు. అనతరం మాట్లాడుతూ కర్నూలు ఉల్లిపాయలు నాణ్యత బాగుందన్నారు. ఉల్లిపాయల్లో నాణ్యత లేదని వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. వారి వెంట అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్లు శ్రీనివాసరావు, జీవీ, సుభాని తదితరులు పాల్గొన్నారు.

15న వీఎంఆర్‌డీఏ అధికారులతో రైతుల సమావేశం

వేపగుంట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎంఆర్‌డీఏ భూవివాదంపై అధికారులతో రైతులకు సోమవారం సమావేశం నిర్వహిస్తున్నట్టు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో భూములు కోల్పోతున్న రైతులు పాల్గొవాలని ఆయన సూచించారు. వీఎంఆర్‌డీఏ భూములు వివాదంపై ఇప్పటికే రైతుల రికార్డులు పరిశీలన పూర్తయిందని, ఈ సమావేశంలో పరిహారం తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉన్నదని ప్రకటనలో తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ మలేరియా సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నిర్మూలణపై జీవీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో శనివారం అక్కిరెడ్డిపాలెంలో నిర్వహించిన కళా ప్రదర్శనలు స్థానికులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను నాటికలు, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సిబ్బందితో పాటు స్థానిక నాయకులు శీరం రాజేశ్, ఎ.శ్రీను, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



పెందుర్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటాద్రిపై కొలువైన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి విగ్రహాన్ని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడు భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకోవడానికి తరలివచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

గాజువాక, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి జగ్గు జంక్షన్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పి.విజయలక్ష్మి (60) అనే వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చినగంట్యాడ ప్రాంతానికి చెందిన చింతకాయల వాణి స్కూటీపై తన తల్లి విజయలక్ష్మి, కుమార్తె తమన్వితో కలిసి సుందరయ్యకాలనీ వైపు వెళ్తుంది. ఈ క్రమంలో జగ్గు జంక్షన్ దాటాక పెద్ద గొయ్యిని తప్పించేందుకు గాను స్కూటీని కుడివైపు మళ్లిస్తుండగా వెనుకే వస్తున్న భారీ వాహనం ఢీకొంది. దీంతో విజయలక్ష్మి రోడ్డు మధ్యలో పడిపోగా, ఆమె పైనుంచి వాహనం వెళ్లడంతో మృతి చెందింది. వాణి, తమన్విలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోవడంతో పాటు వాహనాన్ని గాజువాక ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విజయలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేజీహెచ్‌లో క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం



విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గత కొన్నాళ్లుగా క్యాన్సర్ బారినపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ ఆస్పత్రులకు అత్యాధునిక చికిత్స పరికరాలను సమకూర్చింది. ఇందులో భాగంగానే సుమారు రూ.45 కోట్ల విలువ చేసే పరికరాలను కొద్దిరోజుల కిందట కేజీహెచ్‌కు మంజూరు చేయగా, మంత్రి సత్యకుమార్ యాదవ్ వాటిని ప్రారంభించారు. ఇప్పటికే ఈ పరికరాలపై చికిత్సను రేడియేషన్ అంకాజలీ డిపార్ట్‌మెంట్ వైద్యులు ప్రారంభించారు. ఈ విభాగానికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన పరికరాల జాబితాలో సిటీ సిములేటర్, లీనియర్ యాక్సిలిరేటర్, హెచ్‌డీఆర్ బ్రాకీ థెరపీ వంటి పరికరాలు ఉన్నాయి. ఇవి క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎలా ఉపయోగపడతాయి, రోగులకు ఎలా మేలు చేకూరుతుందనే అంశాలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

నూతన పరికరాలు రావడంతో రోగులకు ఎంతో మేలు

- రూ.45 కోట్లతో సిటీ సిములేటర్, లీనియర్ యాక్సిలిరేటర్, హెచ్‌డీ బ్రాకీ థెరపీ పరికరాలను సమకూర్చిన రాష్ట్ర ప్రభుత్వం
- నేరుగా క్యాన్సర్ కణాలకు చికిత్స అందించే టెక్నాలజీ అందుబాటులోకి..

సీటీ సిములేటర్



రాష్ట్ర ప్రభుత్వం కేజీహెచ్‌కు అందించిన పరికరాల్లో ఇదొకటి. దీని ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలందించే అవకాశం ఉంది. రేడియేషన్ అవసరం అనుకునే రోగులకు దీనిద్వారా వైద్య సేవలందిస్తారు. మొదట రోగిని పరీక్షించేందుకు అనుగుణంగా పడుకోబెడతారు. మాస్క్ మాదిరిగా ఉండే దీనిలో రోగి స్థిరంగా ఉండేలా పడకోబెట్టిన తరువాత రోగి చుట్టూ తిరుగుతూ ఈ పరికరం స్కాన్ చేస్తుంది. ఈ స్కానింగ్ 0.5 మిల్లీమీటర్ల నుంచి మూడు నుంచి ఐదు మిల్లీమీటర్ల సామర్థ్యంతో స్కానింగ్ చేసి ఇమేజ్‌లు తీస్తుంది. ఈ ఇమేజ్‌లు ఇదే పరికరంలో ఉండే కంప్యూటర్ ట్రీట్‌మెంట్ ప్లానింగ్ సిస్టమ్‌లోకి వెళతాయి. అక్కడ ఆస్పత్రికి కణితులను క్షుణ్ణంగా పరిశీలించి సైజు బట్టి ఎంత రేడియేషన్ ఇవ్వాలన్న దానిని మౌస్‌తో వైద్య నిపుణులు డ్రా చేస్తారు. వీటిని పరిశీలించాక రేడియేషన్ ఫిజిస్ట్ ఎటువైపు నుంచి రేడియేషన్ ఎంత మోతాదులో ఇవ్వాలో నిర్ధారిస్తారు. తరువాత లీనియర్ మెషిన్‌లో ఉండే మరో కోన్‌బీమ్ సీటీ మరోసారి స్కాన్ చేస్తుంది. ముందు తీసిన ఇమేజ్‌లో మాదిరిగా కణితులు ఉన్నాయా... ఏమైనా మార్పులు ఉన్నాయా..? అన్నది నిర్ధారించుకున్నాక రేడియేషన్ ప్రక్రియను స్టార్ట్ చేస్తారు. దీనిని ఇమేజ్ గైడెడ్ రేడియో థెరపీ అంటారు. ఈ పరికరాన్ని మెదడు నుంచి కాలి వేలి వరకు చేసే వైద్యానికి వినియోగిస్తుంటారు.

లీనియర్ యాక్సిలిరేటర్



దీని ద్వారా అడ్వాన్స్‌డ్ రేడియేషన్ థెరపీని రోగులకు అందిస్తారు. గతంలో టెలీ కోబాల్ట్ 60 అనే మెషిన్‌పై రేడియేషన్ ఇచ్చేవారు. కానీ లీనాక్ మెషిన్ ద్వారా చిన్న ట్యూమర్లను ట్రీట్ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు వినియోగించిన టెలీ కోబాల్ట్ మెషిన్‌లో 5/5 సెంటీమీటర్ల సైజు కంటే పెద్దగా ఉండే కణితులకు (కణితులు లేకపోయినా రేడియేషన్ వెళ్లిపోయేది) రేడియేషన్ ఇచ్చేందుకు అవకాశం ఉండేది. అంటే.. క్యాన్సర్ కణితులు 1 మిల్లీమీటర్ సైజులో ఉన్నప్పటికీ చుట్టూ ఉండే అదనపు భాగాలకు రేడియేషన్ ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చేది. కానీ ఈ పరికరం వల్ల అదనపు భాగాలకు రేడియేషన్ ఇచ్చే పరిస్థితి ఉండదు. వన్ పాయింట్‌గా క్యాన్సర్ కణాలు ఉన్న భాగానికి మాత్రమే 0.5 మిల్లీమీటర్ల సైజులో కూడా రేడియేషన్ ఇస్తారు. దీనివల్ల క్యాన్సర్ లేని భాగాలకు రేడియేషన్ వల్ల హాని కలిగించే పరిస్థితి రోగులకు ఉండదు. అన్ని రకాల క్యాన్సర్ రోగులకు వైద్య సేవలు అందించడంలో ఇది ఉపయోగపడుతుంది.

హెచ్‌డీఆర్ బ్రాకీ థెరపీ..



ఈ విధానంలో కూడా అడ్వాన్స్‌డ్ రేడియేషన్‌ను అందిస్తారు. గర్భసంచి ముఖద్వార, ప్రోస్టేట్ గ్రంధితోపాటు మరికొన్ని రకాల క్యాన్సర్లలో గడ్డలతోపాటు కింది, చుట్టుపక్కల భాగాల్లో వాపులు (లింపినోడ్స్) వస్తుంటాయి. ఇప్పటివరకు ఈ తరహా క్యాన్సర్ రోగులకు ఎల్‌డీఆర్ (లో డోస్ రేట్) రేడియేషన్‌ను అందిస్తూ వస్తుంటారు. అంటే.. రోగిని 18 గంటలపాటు ఒక గదిలో ఉంచి రేడియేషన్ ఇస్తుంటారు. దీనివల్ల రోగులకు తీవ్ర ఇబ్బందులుండేవి. అయితే హెచ్‌డీఆర్ (హై డోస్ రేట్)లో రేడియేషన్‌ను నేరుగా గడ్డ లోపలకు ఇస్తుంటారు. దీనికి పది నిమిషాల నుంచి అరగంట వరకు మాత్రమే సమయం పడుతుంది. రోగి వచ్చిన రోజే రేడియేషన్ తీసుకుని ఇంటికి వెళ్లిపోవచ్చు. దీనివల్ల రోగికి పెద్దగా ఇబ్బందులు ఉండవు.

రోగులకు అత్యాధునిక వైద్య సేవలు అందించే అవకాశం

-డాక్టర్ ఎం.శ్రీనివాస్, రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి, కేజీహెచ్



క్యాన్సర్ రోగులకు అత్యాధునిక వైద్య పద్ధతుల్లో చికిత్స అందించేందుకు అనుగుణమైన పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే ఈ పరికరాలపై చికిత్స ప్రారంభించాం. ఈ పరికరాల వల్ల రోగులకు సమయం ఆదా కావడంతో పాటు ఆరోగ్యానికి మేలు చేకూరుతుంది. ఇప్పటివరకు ఉన్న పరికరాలతో అందించే రేడియేషన్ వల్ల క్యాన్సర్ కణాలు లేని భాగాలకు ఇబ్బంది ఉండేది. ఇప్పుడలా కాకుండా క్యాన్సర్ కణజాలాలు ఉన్న భాగానికి మాత్రమే రేడియేషన్ ఇస్తున్నాం. అలాగే రేడియేషన్ ఎంత మోతాదులో ఇవ్వాలన్నది కూడా కంప్యూటరైజ్డ్ సిస్టమ్స్ ద్వారా నిర్ధారించి అందిస్తున్నాం. హెచ్‌డీఆర్ బ్రాకీ థెరపీతో నేరుగా క్యాన్సర్ గడ్డలోకే రేడియేషన్ పంపించే వెసులుబాటు కలుగుతోంది. దీనివల్ల రోగులకు గంటల తరబడి సమయం వృథా చేయాల్సిన అవసరం లేకుండా పోతోంది. ప్రస్తుతం క్యాన్సర్ రోగులకు వైద్య సేవలు అందించేందుకు అనుగుణంగా నలుగురు అంకాలజిస్టులు ఉన్నారు. అలాగే రేడియోలాజికల్ సేఫ్టీ ఆఫీసర్ ఒకరు, రేడియేషన్ ఫిజిస్ట్ ఒకరు అందుబాటులో ఉన్నారు. మరొకరు అందుబాటులోకి రానున్నారు. ప్రతి రోజూ పదుల సంఖ్యలో రోగులకు వైద్య సేవలందించేందుకు అవకాశం ఉంది.

క్రైం... crime news

అద్దెకు ఉంటున్న వారి ఇంట్లో గృహ యజమాని భార్య చోరీ

- నిందితురాలి నుంచి 14 తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం



వివరాలు తెలుపుతున్న క్రైమ్ సీఐ శ్రీనివాసరావు

పెందుర్తి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం జరిగిన చోరీ కేసును క్రైమ్ పోలీసులు ఛేదించారు. తమ ఇంట్లో అద్దెకు ఉంటున్న వారి బంగారం, వెండి ఆభరణాలను కాజేసిన ఇంటి యజమాని భార్యే దొంగతనానికి పాల్పడినట్టు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు నిందితురాలి నుంచి 14 తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి స్టేషన్‌లో శనివారం క్రైమ్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సూరిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నరవ సమీప సత్తివానిపా లెంలో సీతారామ గార్డెన్స్‌లో కొయ్యాన రమేశ్, శ్రావణి దంపతులు మూడేళ్లుగా అద్దెకు ఉంటున్నారు. పరవాడలోని అరబిందో ఫార్మా కంపెనీలో రమేశ్ ఇంజనీర్‌గా చేస్తుండగా, శ్రావణి గృహిణి. వీరు అద్దెకుంటున్న మొదటి అంతస్తులో ఇంటి యజమాని చిట్యాడ ధర్మారావు, ఆయన భార్య సుజాత (50) ఉంటున్నారు. రమేశ్, శ్రావణిలకు కొత్తగా పెళ్లవ్వడంతో ఇంటి యజమాని కుటుంబంతో ఎంతో సన్నిహితంగా ఉండేవారు. సుజాతను శ్రావణి పెద్దమ్మలా భావించేది. ఈ క్రమంలో 2023 ఫిబ్రవరి 22న రమేశ్ భార్య శ్రావణితో కలిసి అత్త వారింటికి వెళ్లారు. మూడు రోజుల తరువాత 26వ తేదీన తిరిగి ఇంటికి వచ్చారు. 27న ఫంక్షన్‌కు వెళ్లేటప్పుడు బంగారు ఆభరణాలు ధరించాలని వారు బెడ్‌రూమ్‌లోని డ్రెస్సింగ్‌టేబుల్‌లో చూడగా కనిపించలేదు. ఎక్కడో వాటిని పెట్టామని భావించి ఫంక్షన్‌కు వెళ్లి వాటి గురించి మరిచిపో యారు. ఆ తరువాత రమేశ్ ఆభరణాల గురించి భార్యను ఎప్పుడు అడిగినా.. ఎక్కడ తిడతారోనని భావించి వాటిని ఎక్కడ పెట్టానో గుర్తుకు రావడం లేదని చెబుతూ ఆమె ఇల్లంతా వెదికేది. కాగా నెల 10న ఆభరణాల గురించి రమేశ్ భార్యను గట్టిగా నిలదీయడంతో రెండేళ్ల నుంచి కనిపించడం లేదని చెప్పింది. దీంతో ఆయన పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైమ్ ఎస్ఐ సూరిబాబు వారింటిని క్షుణ్ణంగా పరిశీలించి బాగా తెలిసిన వాళ్లే చోరీకి పాల్ప డినట్టు భావించారు. రమేశ్ ఇంటికి తరచూ ఎవరు వస్తున్నారో ఆరా తీయగా.. ఇంటి యజమాని భార్య సుజాత అని దర్యాప్తులో తేలింది. దీంతో ఆమె కదిలికలపై నిఘా పెట్టారు. ఆర్థిక అవసరాల కోసం ఓ బ్యాంకులో కాజేసిన ఆభరణాలను సుజాత తాకట్టు పెట్టినట్టు గుర్తించారు. పోలీసులు తమదైన శైలిలో ఆమెను విచారించగా రమేశ్ తన భార్యతో కలిసి అత్తవారింటికి వెళ్లినప్పుడు డూప్లికేట్ తాళంతో వారింట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడినట్టు తెలిపింది. ఈ మేరకు సుజాతను అరెస్టు చేయడంతో పాటు రూ.15 లక్షల విలువైన బంగా రం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

కి'లేడీ' అరెస్టు

- 6.5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

పెందుర్తి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ సహచర మహిళా ప్రయాణికులను మాయ మాటలతో మభ్యపెట్టి వారు ఏమరుపాటుగా ఉన్న సమయంలో వారి బ్యాగులను తస్కరించి వాటిలో గల బంగారు ఆభరణాలను కాజేస్తున్న కిలాడీ లేడీని పెందుర్తి క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కి'లేడీ' నుంచి 6.5 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం క్రైమ్ ఎస్ఐ సూరిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తిలోని చైతన్య లేఅవుట్‌లో నివాసం ఉంటున్న రాయుడు దుర్గాభవానీ ఈ ఏడాది జూన్ 24న గోపాలపట్నంలో గల ఓ బ్యాంకులో తాకట్టు పెట్టిన 6.5 బంగారు ఆభరణాలను విడిపించి తన హ్యాండ్ బ్యాగులో పెట్టుకుని పెట్రోల్ బంక్ వద్ద ఆటో ఎక్కింది. మార్గమధ్యంలో ఆర్ఆర్‌వీ పురం వద్ద ఓ యువతి ఇదే ఆటో ఎక్కి దుర్గాభవానీని మాటల్లోకి దించి వేపగుంట వద్ద దిగిపోయింది. ఇంటికి చేరుకున్నాక దుర్గాభవానీ తన హ్యాండ్ బ్యాగులో బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ఆటో ఎక్కిన యువతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సూరిబాబు సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన పాత నేరస్తురాలైన మాకిరెడ్డి గని (19)ని అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం చేసినట్టు ఆమె అంగీకరించడంతో అరెస్టు చేయడంతో పాటు చోరీ చేసిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

నేడు అమరావతికి కలెక్టర్ పయనం

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఈ నెల 15, 16 తేదీల్లో జరగనున్న కలెక్టర్ల సదస్సులో పాల్గొనేందుకు విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదివారం బయలుదేరి వెళ్లనున్నారు. సదస్సులో ప్రస్తావించే అంశాలకు అనుగుణంగా జిల్లా సమాచారాన్ని ఇప్పటికే సిద్ధంచేశారు. శాఖల వారీగా ప్రగతి, ప్రాజెక్టుల అమలు తీరు, కొత్త ప్రాజెక్టులు, తదతర అంశాలపై సంబంధిత అధికారులు ఇచ్చిన నివేదికల మేరకు సమగ్ర రిపోర్టును సిద్ధం చేశారు. ప్రధానంగా విశాఖలో ఐటీ కంపెనీల ఏర్పాటు, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ ప్రాజెక్టులపై సదస్సులో ప్రస్తావించే అవకాశం ఉంది. కలెక్టర్ల సదస్సుకు జిల్లాల వారీగా ప్రత్యేకించి అజెండా లేకపోయినా విశాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో కలెక్టర్ హాజరవుతున్నారు.

రాష్ట్ర స్థాయి మల్లఖంబ్ పోటీలకు జిల్లా జట్టు



మల్లఖంబ్‌పై భంగిమలను ప్రదర్శించిన క్రీడాకారులతో నిర్వాహకులు

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి అండర్-19 మల్లఖంబ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఆసక్తికరంగా సాగాయి. విశాలాక్షినగర్‌లోని బీవీకే జూనియర్ కళాశాలలో జరిగిన ఎంపిక పోటీలకు జిల్లా వ్యాప్తంగా 50 మంది బాలురు, బాలికలు పాల్గొని నిలువు స్తంభంపై వైమానిక యోగా, జిమ్నాస్టిక్ భంగిమలతో ప్రతిభను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశామని, త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్-19 మల్లఖంబ్ పోటీల్లో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (అండర్-19) విశాఖ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వీపీ పుష్పలత తెలిపారు.

వసతిగృహాల విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్య పరి రక్షణకు, ఆరోగ్యవంతమైన భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో కలెక్టర్ ఆదేశాల మేర కు వారికి వైద్య పరీక్షలను నిర్వ హించారు. జిల్లాలోని 28 బీసీ, 23 సాంఘిక సంక్షేమశాఖతో పాటు ఇతర వసతిగృహాల్లో ఉం టున్న సుమారు 5,500 మంది విద్యార్థులకు పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లకు చెందిన వైద్యాధికారుల ఆధ్వర్యంలో శనివారం వైద్య పరీక్షలు చేశారు. ప్రతినెలా రెండో శనివారం విద్యార్థులకు వైద్య పరీక్షలు జరపాలన్న కలెక్టర్ ఆదేశాలతో ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు తెలిపారు.

హెల్మెట్ ధారణపై వినూత్న ప్రచారం

- నగరంలో ఎక్కడికక్కడ హోర్డింగ్‌లు



వెంకోజీపాలెం కూడలిలో ఏర్పాటు చేసిన హోర్డింగ్

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతపై అవగాహన పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది. నగరంలో జరిగే రోడ్డు ప్రమాదాలకు కారణంగా ఏటా 400 మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిలో సగానికి పైగా ద్విచక్ర వాహనదారులే కాగా.. వీరిలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు తీవ్ర గాయాలై మృతి చెందిన వారి సంఖ్య వందకుపైగా ఉంటోంది. దీంతో రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే మరణాలను తగ్గించేందుకు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా నగరంలోని ప్రధాన రహదారులపై ఎక్కడికక్కడ హోర్డింగ్‌లపై హెల్మెట్ దారణ వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు ఇంటికి వెళ్లేసరికి కుటుంబ సభ్యుల ఆనందం గురించి, భవిష్యత్తుపై కనే కలలు నిజం చేసుకుంటే కలిగే సంతోషం గురించి వివరిస్తూ హోర్డింగ్‌లను ప్రదర్శిస్తున్నారు. వీటిని చూడగానే హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులు తాము తప్పుచేస్తున్నామనే భావనకు గురై ఇకపై హెల్మెట్ ధరించాలనే అభిప్రాయాన్ని తమ స్నేహితులు, కుటుంబ సభ్యుల వద్ద వ్యక్తం చేస్తుండడం విశేషం.

స్టీల్ ప్లాంటును ప్రభుత్వమే నిర్వహించాలని సీపీఐ ఆందోళన



నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

సిరిపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటును ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో స్టీల్ ప్లాంటు నిర్వహణపై స్పష్టమైన ప్రకటన చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎ.విమల, రాష్ట్ర సమితి సభ్యుడు పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్కే రెహమాన్‌లు మాట్లాడుతూ విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు స్టీల్ ప్లాంటును ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయటం లేదని చెబుతూనే, ఇటీవల 43 విభాగాలను ప్రైవేటుకు ధాధాదత్తం చేయడంలో మతలబు ఏమిటో స్పష్టం చేయాలన్నారు. ప్లాంటుపై స్పష్టమైన వైఖరిని చెప్పకుండా బీజేపీ ఇక్కడ సభ పెట్టడం ఈ ప్రాంతవాసులను మోసం చేయడమేనన్నారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ కార్యకలాపాలు ఎప్పటిలోగా ప్రారంభిస్తారో వెల్లడించాలన్నారు. ప్రైవేటు వ్యక్తులకు పెద్దపీటవేసేలా మిట్టల్ కంపెనీకి అన్ని అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుండడం ప్రజలను మోసం చేసినట్టు కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, వనజాక్షి, బేగం, మన్మధరావు, క్షేత్రపాల్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్‌కు సీఐఐ ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆర్సెలర్ మిట్టల్ ప్రతినిధులు

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియాకు సీఐఐ నుంచి జాతీయ అవార్డు లభించింది. పర్యావరణ పరిరక్షణలో బెస్ట్ ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ అవార్డుతో పాటు ఎక్సలెంట్ ఎన్విరాన్‌మెంటల్ ప్రాజెక్టు అవార్డు వచ్చింది. పర్యావరణ పరిరక్షణలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న వారికి సీఐఐ పుణేలో శుక్రవారం నిర్వహించిన 12వ జాతీయ సదస్సులో అవార్డులను అందజేసింది. ఈ అవార్డును సంస్థ తరఫున ఎం.వేణుగోపాల్, ఆదినారాయణ రెడ్డి, సౌమ్య రంజన్ రౌత్ అందుకున్నారు.